ఈనాడు కర్ణాటక
గురువారం సెప్టెంబరు 26, 2024

గంగావళిలో కన్నీటి వరద

బురదలో మునిగిన లారీలో మరో రెండు మృతదేహాలు


గంగావళి నదిలో డ్రెడ్జర్ సాయంతో లారీని వెలికి తీస్తున్న సిబ్బంది (అంతర్‌చిత్రం) అర్జున్

కార్వార, న్యూస్‌టుడే : కొండచరియలు విరిగి పడటంతో ఉత్తర కన్నడ జిల్లా కార్వార శిరూరు సమీప గంగావళి నదిలోకి కొట్టుకు పోయి మరణించిన వారిలో ఇద్దరి మృతదేహాలను బుధవారం వెలికి తీశారు. కొండ మట్టితోపాటు దిగువన నదిలోకి లారీ దొర్లిపోయిన విషయం తెలిసిందే. ఆ బురద నీటిలో చిక్కిన లారీ క్యాబిన్‌లో ఉన్న మృతదేహాన్ని అర్జున్‌గా గుర్తించారు. మరో మృతదేహంపై అంచనాకు రాలేక పోతున్నారు. ఆ నాడు గల్లంతైన జగన్నాథ నాయక్, లోకేశ్‌లలో ఒకరిది అయి ఉంటుందని భావిస్తున్నారు. రెండు నెలల కిందట జరిగిన ఘటనలో మొత్తం 11 మంది మరణించారు. వారిలో ఎనిమిది మంది మృతదేహాలను ఇదివరకే గుర్తించారు. ప్రస్తుతం మరో ఇద్దరి మృతదేహాలను గుర్తించడం, మరొక దేహాన్ని గుర్తించే ప్రక్రియను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

బిగిస్తున్న ముడా ఉచ్చు

ప్రత్యేక కోర్టు తీర్పుతో సిద్ధుకు మరింత సంకటం

ఈనాడు, బెంగళూరు : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మెడకు మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) ఉచ్చు అంతకంతకూ బిగిస్తోంది. మంగళవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాస్త కంగారు పడిన సిద్ధు.. బుధవారం మరింత సంకట స్థితికి చేరుకున్నారు. సమగ్ర తనిఖీకి అర్హత ఉన్న ముడా అక్రమాలపై గవర్నర్ ఆదేశాలు చట్టబద్ధమని హైకోర్టు ఇచ్చిన తీర్పు.. ప్రజాప్రతినిధుల న్యాయస్థానానికి ఓ దారి చూపినట్లయింది. బుధవారం ఈ కేసును విచారించిన ఆ న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ గజానన భట్ ఇచ్చిన ఆదేశాలు రాజకీయాల్లో పెను సంచలనం రేపాయి. ముఖ్యమంత్రి ప్రభావం ఉండని విధంగా 'ముడా' స్థలాల పంపిణీ వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని లోకాయుక్తకు ఆదేశించటంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఈ వివాదాలను ఎదుర్కొనేందుకు తాను సిద్ధమని సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేయగా.. ఆయన రాజీనామా కోసం డిమాండ్ చేస్తున్న విపక్షాల స్వరానికి మరింత గట్టిదనం వచ్చింది. గురువారం నుంచి విధానసౌధ ముందుకుని రాష్ట్రవ్యాప్తంగా సిద్ధు రాజీనామాకు భాజపా ఆందోళన కార్యక్రమాలు మొదలవనున్నాయి. మరోవైపు కోర్టు ఆదేశాల ప్రకారం మైసూరు లోకాయుక్త పోలీసులు ముడా అక్రమాలతో సంబంధమున్న వారిపై కేసు నమోదు చేసే పనిలో పడ్డారు.

కేసు సాధ్యమేనా?

ఈ దర్యాప్తు పారదర్శకంగా కొనసాగాలంటే సిద్ధు రాజీనామా చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. ముఖ్యమంత్రి రాజీనామా అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ నేతలతో పాటు మంత్రివర్గ సహచరులంతా తేల్చి చెబుతున్నారు. తాను ఈ దర్యాప్తును ఎలా ఎదుర్కోవాలో సిద్ధంగా ఉన్నానని సిద్ధు వెల్లడించారు. హైకోర్టు, ప్రత్యేక కోర్టుల తీర్పులను మరింత లోతుగా చదివిన తర్వాత తన నిర్ణయం ఏమిటో చెబుతానని ప్రకటించారు. మరోవైపు ఈ కేసులో సిద్ధు పాత్రపై రుజువులతో కూడిన దాఖలాలను రాజ్‌భవన్‌కు, కోర్టులకు సమర్పించిన ఫిర్యాదుదారులు టి.జె. అబ్రహం, స్నేహమయి కృష్ణ, ప్రదీప్ కుమార్.. కేసులో విజయం సాధించగలమన్న ధీమాతో ఉన్నారు. ఫిర్యాదుదారులు, విపక్షాల ప్రధాన లక్ష్యం ముఖ్యమంత్రి అయినా ఆయనపై కేసు నమోదు చేయటం సాధ్యమేనా? అన్న సందేహాలు మొదలయ్యాయి. హైకోర్టు, ప్రత్యేక కోర్టుల ఆదేశాల ప్రకారం ముఖ్యమంత్రి ప్రధాన నిందితుడిగా పరిగణించలేదు. 'ముడా' స్థలాల పంపిణీలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఫిర్యాదుదారులు సమర్పించిన దాఖలాల్లో స్పష్టంగా ఉంది. ఈ అక్రమాల్లో ప్రధాన లబ్ధిదారులు ముఖ్యమంత్రి సతీమణి కె.పార్వతి, ఆయన బావమరిది మల్లికార్జున స్వామి.. ఈ అక్రమాలకు వేదిక కల్పించింది ముడా. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి అందులో ముఖ్యమంత్రి పాత్రపై నిగ్గు తేల్చాలని కోర్టుల ఆదేశాల్లో ప్రస్తావించారు. ఆ రకంగా.. కేసులో ముఖ్యమంత్రి ప్రధాన నిందితుడిగా పరిగణించలేదని స్పష్టమవుతోంది. ప్రధాన నిందితుడు కానీ వ్యక్తికి నేరుగా తాఖీదులు ఇవ్వటం, లేదా కేసు నమోదు చేసేందుకు ఏదేని విచారణ సంస్థ సాహసించకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సరిగ్గా ఇదే ధీమాతో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలుస్తోంది.


రాజీనామా చేసేది లేదంటూ బెంగళూరులో ప్రకటిస్తున్న సిద్దరామయ్య

నైతికతే సమస్య

ముడా కేసులో ముఖ్యమంత్రి పాత్రకు నైతికత, చట్టబద్ధతలు విడదీయలేని బంధంలా మారాయి. మాజీ లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే బుధవారం మంగళూరులో చేసిన వ్యాఖ్యలు తాజా నిబద్ధతను ఘాటుగా ప్రశ్నించాయి. చట్టపరంగా విచారణను ఎదుర్కొనే నేతలెవరైనా రాజీనామా చేయాలని లేదు. ప్రజలు ఎన్నుకున్న వారు నైతికతను పాటిస్తే సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయాల్సిందేనన్నారు. ఇదే సందర్భంగా తాను ఏ తప్పు చేయలేదని కోర్టులో పిటిషన్ వేసిన నేతకు.. కోర్టు తీర్పులు వ్యతిరేకంగా వచ్చాయంటే రాజీనామా చేసేందుకు అర్హుడనే అర్థమని హెగ్డే విశ్లేషించారు. ముఖ్యమంత్రి విస్తృత ధర్మాసనానికి వెళ్లినా ఆయనకు ఇదే తీర్పు వస్తుందన్నారు. ఓ న్యాయవాదిగా హైకోర్టులో సవాలు చేయకపోవటం, వ్యక్తిగా రాజీనామా చేయటం, రాజకీయపరంగా అధికారంలో ఉండాలని భీష్మించుకోవటం సిద్ధరామయ్య ముందున్న ఐచ్ఛికాలని వెల్లడించారు. అవినీతి నిరోధక చట్టం 17ఏ సవరించాలనీ సూచించారు. కేవలం ప్రజా ప్రతినిధులకే ఈ చట్టం ఓ చుట్టంలా మారిందన్నారు. వీరికి మాత్రమే రక్షణ కల్పించే ఈ చట్టం ఆవశ్యకతను ఆయన ప్రశ్నించారు.

దర్యాప్తుపై అనుమానం

ముడా అక్రమాలను తనిఖీ చేసే బాధ్యత లోకాయుక్తకు అప్పగించటంపై సర్వత్రా ఆక్షేపణ వ్యక్తమవుతోంది. అధికార పక్షం పర్యవేక్షణలో పని చేసే పోలీసు వ్యవస్థలో భాగమైన లోకాయుక్త.. ఈ కేసులో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయగలదా అంటూ విపక్షాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ విస్తృతంగా చర్చ మొదలైంది. దేశానికి మాదిరిగా మారిన కర్ణాటక లోకాయుక్త అధికారాలను 2016లో పరిమితం చేసిన ఇదే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేడు ఆ సంస్థ విచారణ కోసం ఎలా సహకరిస్తారన్న ప్రశ్న తలెత్తింది. లోకాయుక్త విచారణ అధికారాలను ఏసీబీకి బదిలీ చేసిన కాంగ్రెస్ సర్కారు నిర్ణయాన్ని 2022లో కొట్టివేసిన హైకోర్టు ప్రస్తుతం ఆ సంస్థకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. ఆ సంస్థ స్వేచ్ఛగా దర్యాప్తు చేయాలంటే ప్రభుత్వం నుంచి ఒత్తిడి రాకుండా అడ్డుకునేదెవరని విపక్షాలు సైతం ప్రశ్నిస్తున్నాయి. ఈ కారణంగానే భాజపా ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేసింది.

తప్పుకోక తప్పదు..

2011లో అప్పటి ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్పపై ఆరోపణలు రాగా.. విపక్ష నేతగా ఉన్న సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యల ఆడియోను భాజపా విడుదల చేసింది. పారదర్శకత, నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలంటే అప్ప రాజీనామా చేయాలని నాడు సిద్ధు డిమాండ్ చేశారు. అప్పటి మాటకు కట్టుబడి నేడూ రాజీనామా చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర డిమాండ్ చేశారు. మైసూరు ఛలో పాదయాత్ర ద్వారా ఈ అక్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా చేశామన్నారు. ఈ అక్రమాలు వాస్తవమేనని కోర్టులు తేల్చాయని గుర్తుచేశారు. కోర్టుల ఆదేశాలు ఒక్కొక్కటిగా వెల్లడవుతున్నా ముఖ్యమంత్రికి మంత్రుల నుంచి మద్దతు అంతకంతకూ పెరుగుతోంది. జమీర్ అహ్మద్ ఖాన్, లక్ష్మీ హెబ్బాళ్కర్, చలువరాయ స్వామి, సతీశ్ జార్ఖిహొళి తదితరులంతా ముఖ్యమంత్రి రాజీనామా అవసరం లేదన్నారు.



ముఖ్యమంత్రి పదవికి సిద్ధు రాజీనామా చేయాలంటూ బెంగళూరులో ఆందోళనకు దిగిన జనతాదళ్ కార్యకర్తలు

ప్రధాని నోట..

ముడా అక్రమాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం హరియాణాలోని సోనిపత్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రస్తావించారు. కేవలం ఒకటిన్నర ఏడాదిలోనే కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు అక్రమాల్లో కూరుకుపోయిందన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దళితుల భూములను కాజేసినట్లు కోర్టులు తేల్చాయని ఆయన గుర్తు చేశారు. గవర్నర్ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేసిన ముఖ్యమంత్రికి కోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలినట్లు ప్రధాని ముడా తీర్పులను ప్రస్తావించారు.

రాజీనామానే మేలు: జస్టిస్ సంతోశ్ హెగ్డే

మంగళూరు, న్యూస్‌టుడే : ముడాలో అక్రమాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసి విచారణ ఎదుర్కోవాలని విశ్రాంత లోకాయుక్త జస్టిస్ సంతోశ్ హెగ్డే పేర్కొన్నారు. ఒకవేళ తన పదవికి రాజీనామా చేయకుండా, విచారణను ఎదుర్కొన్నా.. నేరం కాదని స్పష్టం చేశారు. మంగళూరులో తనను కలుసుకున్న విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విచారణను ప్రభావితం చేశారన్న ఆరోపణలు రాకుండా ఉండాలంటే పదవికి రాజీనామా చేయవలసి ఉంటుందన్నారు.

కాంగ్రెస్ సర్కారుపై కుట్ర: ఎంబీ

విజయపుర: ఎన్నికలకు బాండ్లను సేకరించడం ప్రజాస్వామ్యబద్ధం కాదని సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదవికి రాజీనామా చేయాలని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ డిమాండ్ చేశారు. తాను పదవికి రాజీనామా చేయకుండా, చేయని తప్పునకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రాజీనామా చేయమని ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నించారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మురుగేశ్ నిరాణి, జనార్దన రెడ్డి, హెచ్‌డీ కుమారస్వామి, శశికళ జొల్లె తదితరులూ పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, భాజపాలో పలువురు నాయకులు బెయిలుపై బయటే ఉన్నారన్నారు.

మద్దతుదారుల మౌనప్రదర్శన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రాజకీయంగా దెబ్బతీసేందుకు ప్రత్యర్థులు కుట్రలకు పాల్పడుతున్నారంటూ వివిధ ప్రాంతాల్లో బుధవారం నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. బెంగళూరు ఫ్రీడంపార్కులో కర్ణాటక పీడిత వర్గాల మహా వేదిక నేతృత్వంలో సభ్యులు నల్లరిబ్బన్లు కట్టుకుని మౌనంగా నిరసన తెలిపారు. వేదిక అధ్యక్షుడు ఎం. రామచంద్రప్ప స్పందిస్తూ.. సిద్ధరామయ్య రాజకీయ జీవితం మచ్చలేనిదన్నారు. ఆయనపై కొందరు బురద జల్లుతున్నారని తప్పుపట్టారు. భాజపా, జేడీఎస్ నేతలే ముడా సంఘటనను తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. డీఎస్ఎస్ రాష్ట్ర సంచాలకుడు మావళ్లి శంకర్, మాజీ మేయర్ వెంకటేశ్ మూర్తి, కురుబర సంఘం డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మైసూరులోనూ దళిత సంఘాల ప్రతినిధులు మౌన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు.


మైసూరులో సిద్ధుకు మద్దతుగా నిలచిన దళిత సంఘాల ప్రతినిధులు


సిద్ధు నివాసాన్ని ముట్టడించేందుకు వెళుతున్న యువ మోర్చా కార్యకర్తలు

ఉద్యమించిన యువమోర్చా

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : హైకోర్టు ఇచ్చిన తీర్పునకు గౌరవమిచ్చి, నైతిక బాధ్యతతో ముఖ్యమంత్రి స్థానానికి రాజీనామా చేయాలంటూ సిద్ధరామయ్య 'కావేరి' నివాసాన్ని భాజపా యువ మోర్చా కార్యకర్తలు బుధవారం ముట్టడించారు. ఆయన నివాసంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను భద్రత సిబ్బంది, పోలీసులు అడ్డుకుని బంధించారు. బీఎంటీసీ బస్సులో వారిని ఎక్కించి సమీపంలోని హైగ్రౌండ్స్ ఠాణాకు తరలించారు. కొంత సమయం అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఆందోళనకు నేతృత్వం వహించిన సప్తగిరి గౌడ స్పష్టం చేశారు.


ముఖ్యమంత్రి నివాసం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. నినాదాలు చేస్తూ..

ఆమెను చంపేసి.. కడతేరిపోయాడు

బెంగళూరు (శివాజీ నగర), న్యూస్‌టుడే : బెంగళూరు నగర శివార్లలో ఓ యువతిని 59 ముక్కలుగా నరికి.. రిఫ్రిజిరేటర్లో కుక్కి.. పారిపోయిన నిందితుడు చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. నేపాల్‌కు చెందిన మహాలక్ష్మి (29)ని దారుణంగా హత్య చేసిన ముక్తిరంజన్ రాయ్ (32) ఒడిశాలో బలవన్మరణానికి పాల్పడినట్లు సంబంధిత అధికారులు బుధవారం ఇక్కడ వెల్లడించారు. ఈ నెల మొదటివారంలో ఆమెను హత్య చేసిన నిందితుడు మృతదేహాన్ని ముక్కలుగా చేసి రిఫ్రిజిరేటర్‌లో ఉంచాడు. ఓ చిన్న విషయంలో ఆమెతో గొడవపడి కడతేర్చినట్లు ప్రాథమిక సమాచారం. ఇంట్లోనే చంపేశాక.. ఓ దుకాణానికి వెళ్లి పెద్దకత్తి, సంచులు తెచ్చి ముక్కలుగా నరికినట్లు గుర్తించారు. హత్య అనంతరం రెండు రోజులు ఇంట్లోనే ఉండి, ఆధారాలు చెరిపి వేశాడని వయ్యాలికావల్ ఠాణా పోలీసులు గుర్తించారు. ఆమెను కడతేర్చిన విషయాన్ని హెబ్బగోడిలోని తన సమీప బంధువుకు చెప్పి.. వెళ్లిపోయాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆ వ్యక్తి మొదట ఈశాన్య రాష్ట్రాలకు పరారైనట్లు అనుమానించారు. ఒడిశాలో ఉన్నట్లు గుర్తించి.. అక్కడకు వెళ్లేలోగా అతను ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు.


ముక్తిరంజన్ రాయ్


మహాలక్ష్మి

ట్రాక్టరు కింద నలిగిపోయిన విద్యార్థులు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : చిక్కబళ్లాపుర సమీపంలో గేరహళ్లి గేటు వద్ద బుధవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మరణించారు. నితీశ్ (17), నితిన్ (17), వైభవ్ (17)లను మృతులుగా గుర్తించారు. ట్యూషన్‌కు వెళ్లి ఒకే బైకుపై ఆవలగుర్కిలోని తమ నివాసాలకు వెళుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. బీబీఎస్ కళాశాలలో వీరు మొదటి ఏడాది పీయూ విద్యార్థులు. తీవ్రంగా గాయపడిన వీరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు. చిక్కబళ్లాపుర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భాజపా నాయకురాలికి శిక్ష

కార్వార, న్యూస్‌టుడే : తప్పుడు దాఖలాలు సృష్టించి, ప్రభుత్వాన్ని వంచించిన ఆరోపణలు రుజువు కావడంతో ఉత్తర కన్నడ జిల్లా భాజపా మాజీ ప్రధాన కార్యదర్శి ఉషా హెగ్డేకు ఒక ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ కార్వార లోకాయుక్త న్యాయస్థానం ఆదేశించింది. జిల్లా పంచాయతీ సభ్యురాలిగా ఎన్నికైన అనంతరమూ శ్రీనగర పంచాయతీ పరిధిలో అంగన్‌వాడి కార్యకర్తగా పని చేస్తూ గౌరవ వేతనాన్ని అందుకున్న ఆరోపణలు ఉన్నాయి. విచారణ పూర్తి చేసిన న్యాయస్థానం బుధవారం ఈ ఆదేశాలు ఇచ్చింది.

చెరకు తోటలోకి దూసుకొచ్చిన బస్సు

బెళగావి, న్యూస్‌టుడే : ధార్వాడ నుంచి బైలహొంగలకు వెళుతున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న చెరకు తోటలోకి బుధవారం దూసుకు పోయింది. మలప్రభ నదీ తీరంలోని పొలం పక్కన ఉన్న సోయాబీన్ యంత్రాన్ని ఢీకొట్టింది. అనంతరం పొలంలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో బస్సు కండక్టర్‌తో కలిపి ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. బాధితులను అంబులెన్సులో బైలహొంగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బైలహొంగల ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మునిరత్నకు మరిన్ని కష్టాలు


మునిరత్న

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలతో కారాగారం చేరిన రాజరాజేశ్వరీనగర ఎమ్మెల్యే మునిరత్న (భాజపా) బెయిలు కోసం వేసుకున్న అర్జీ విచారణ అక్టోబరు ఒకటో తేదీకి వాయిదా పడింది. మునిరత్న తరఫున న్యాయవాది అశోక్ హార్నహళ్లి 42వ ఏసీఎంఎం న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. ప్రభుత్వం కేసుల విచారణకు ప్రత్యేక దర్యాప్తు దళాన్ని ఏర్పాటు చేసిందని న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. వాదనలను ఆలకించిన అనంతరం విచారణను వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. రాజరాజేశ్వరినగర పరిధిలో 2020-22 మధ్యలో జరిగిన పనుల్లో రూ.500 కోట్ల విలువైన అక్రమాలు జరిగాయని పాలికె రెవెన్యూ విభాగం ప్రత్యేక కమిషనర్ గుర్తించారు. దీనిపై విచారణకు ఆదేశించారు. పనులు చేయకుండానే బిల్లులు మంజూరు చేసిన ఆరోపణలు రుజువైతే.. మునిరత్న మరిన్ని సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది.

వీడియోల ప్రచారం ఎవరిపని?

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : హైకోర్టులో జరిగే కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్న వారి వివరాలు ఇవ్వాలని యూట్యూబ్, ఎక్స్ కార్ప్, ఫేస్‌బుక్ సంస్థలకు ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. గౌరీపాళ్య ప్రాంతం పాకిస్థాన్‌లో ఉన్నట్లు కనిపిస్తోందని ఒక న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యల వీడియోలను పలువురు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీన్ని ప్రశ్నిస్తూ బెంగళూరు న్యాయవాదుల సంఘం వేసుకున్న అర్జీని పరిగణనలోకి తీసుకుని ఉన్నత న్యాయస్థానం ఈ ఆదేశాలు ఇచ్చింది.



ప్రతిభాగం.. భారతావనే: భారత్‌లోని ఏ భాగాన్నీ పాకిస్థాన్ అని పిలవకూడదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కర్ణాటక హైకోర్టులో న్యాయమూర్తి ఒకరు గౌరీపాళ్య ప్రాంతాన్ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పందించారు. ఈ ఘటనపై హైకోర్టు న్యాయమూర్తి పొరపాటును అంగీకరించడంతో- ఈ కేసు విచారణను కొనసాగించకూడదని జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా తదితరులతో కూడిన పీఠం బుధవారం తీర్మానించింది.

యువ జోష్

దసరా వేడుకలు సమీపిస్తున్నాయి. రాచనగరి మైసూరులో ఒక్కో వేడుకకే తెరతీస్తున్నారు. పర్యాటకులను ఆద్యంతం కట్టిపడేయడమే లక్ష్యంగా కొనసాగించదలచిన సాంస్కృతిక సౌరభాలు ఈసారి మరింత కాంతులీననున్నాయి. వేడకల్లో భాగంగా బుధవారం రాత్రి రాచనగరిలో ఆరంభమైన 'యువ సంభ్రమ' వేదికపై ఆకట్టుకున్న ప్రదర్శనలో ఇదీ ఒకటి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కదలివచ్చిన యువతతో మైసూరు సందడిగా మారుతోంది.
- న్యూస్‌టుడే, మైసూరు



విగ్రహాలకు అవమానం

బెళగావి, న్యూస్‌టుడే : సదలగా పట్టణంలో ప్రతిష్ఠాపించిన వినాయకుని విగ్రహాలను పలువురు చెత్తలో పడేసి వెళ్లారు. నదిలో విగ్రహాలను నిమజ్జనానికి తీసుకువెళితే నీరు కలుషితం అవుతుందని పర్యావరణ ప్రేమికులు అడ్డుకోవడంతో వాటిని చెత్తకుప్పలపై పడేశారు. హిందూ సంఘాల కార్యకర్తలు ఈ ఘటనను ఖండించారు.

దర్శన్‌కు మళ్లీ చుక్కెదురు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో నిందితులు- సినీ కథానాయకుడు దర్శన్, నటి పవిత్రా గౌడ బెయిలు అర్జీ విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. ఈ కేసులో ఇప్పటికే కేశవమూర్తి, కార్తిక్, నిఖిల్‌కు బెయిలు లభించింది. ఆక్షేపణలు దాఖలు చేసేందుకు కాలావకాశం ఇవ్వాలని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరడంతో విచారణను 57వ సిటీ సివిల్ కోర్టు వాయిదా వేసింది.

కిలో బంగారంతో సత్కారమట!

బెంగళూరు (మల్లేశ్వరం): పంచమసాలి సముదాయాన్ని 2ఏ రిజర్వేషన్ విభాగానికి చేర్చితే మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను కిలో బంగారంతో సత్కరిస్తానని మాజీ మంత్రి మురుగేశ్ నిరాణి వ్యాఖ్యలు చేశారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు రిజర్వేషన్లను ఇప్పించాలని గుర్తుకు రాలేదా అని నిరాణిని హెబ్బాళ్కర్ ప్రశ్నించారు. ప్రభుత్వమే రిజర్వేషన్లను ఇచ్చినా, దాన్ని ఆమోదించవలసింది కేంద్రమేనని స్పష్టం చేశారు. భాజపాలో సీనియరు నాయకునిగా మీరే పూనుకుని.. రిజర్వేషన్‌ను ఇప్పించాలని ఆయనకు హితవు పలికారు.

వికటించిన శస్త్రచికిత్స

మంగళూరు, న్యూస్‌టుడే : అందంగా మారేందుకు కాస్మొటిక్ సర్జరీ చేయించుకునేందుకు వెళ్లిన మహ్మద్ మారిఫ్ (32) అనే వ్యక్తి చికిత్స ఫలించక మరణించారు. ఉళ్లాల అక్కరెకెరెకు చెందిన ఆయన కంకనాడి సమీపంలోని ఆసుపత్రిలో శస్త్రచికిత్సకు గత శనివారం చేరారు. చికిత్స ఫలించక మంగళవారం రాత్రి మరణించారు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కంకనాడి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆ పెట్టెలో ఏముంది?


బాంబు నిష్క్రియ దళ సభ్యుడి సాహసం

కోలారు, న్యూస్‌టుడే : కోలారు నగర శివారు టమక సమీప రహదారి పక్కన ఉన్న ఓ సూట్‌కేస్ బుధవారం తీవ్ర కలకలం రేపింది. బాంబు నిష్క్రియదళ సభ్యులు రంగంలోకి దిగి.. అందులో ఏమున్నదీ తెలుసుకునే ప్రయత్నం చేశారు. చివరికి డిటోనేటర్‌తో దాన్ని పేల్చివేశారు. సర్వీసు రోడ్డు పక్కన ఉన్న సూట్‌కేసును దూరంగా నిలబడి స్కానింగ్ చేయగా.. అందులో ఏమీ లేదని తెలుసుకున్నారు. అయినప్పటికీ విచిత్ర శబ్దాలు వస్తుండడంతో బెంగళూరు నుంచి వచ్చిన నిపుణులు దాన్ని పేల్చి వేశారు. ఆ శకలాలను తమతో తీసుకువెళ్లారు. ఫోరెన్సిక్ ప్రయోగశాలకు సూట్‌కేసు ముక్కల్ని పంపిస్తామని అధికారులు తెలిపారు.



, కోరమంగల రాజకాలువ విస్తరణ పనుల్లో వేగం



విజన్-20 పథకం కింద కొన్ని ప్రాంతాల్లో పనుల పూర్తి



కాలువలో పూలమొక్కల అమరిక ఇలా..

ఉద్యాననగరికి లండన్ మెరుపులు!

● మురుగుకాలువలకు మేలిమి హంగులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కంపుకొట్టే బెంగళూరు మురుగుకాలువలు ఆధునిక హంగులతో మెరిసిపోయే రోజులు సమీపించాయి. చారిత్రక లండన్ నగర థేమ్స్ నది అనుబంధ బకింగ్‌హాం కాలువ తరహాలో ఎన్నెన్నో అందాలను ఇక్కడి కాలువలకూ సొంతం చేసుకొంటున్నాయి. ఇప్పటికే కోరమంగల రాజకాలువను అభివృద్ధి చేసేందుకు బృహత్ బెంగళూరు మహానగర పాలికె 'విజన్-20' పథకం తెరపైకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇజ్రాయిల్ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పథకాన్ని చేపట్టారు. కాలువలో మురుగు ప్రవాహాన్ని నిలువరించడానికి శుద్ధీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రమాదకరం కాని నీరు ప్రవహించేలా చేస్తున్నారు. ఇక్కడ 120 ఎంఎల్‌డీ స్థాయి శుద్ధీకరణ విభాగం సాయంతో మంచి నీటినే కాలువలోకి విడుదల చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం పది ఎంఎల్‌డీ నీరు విడుదల చేస్తున్నట్లు పాలికె అధికారులు తెలిపారు. ఈ పథకాన్ని 2018లో అప్పటి ముఖ్యమంత్రి యడియూరప్ప ప్రారంభించారు. నిర్మాణ పనులను శాంతినగర బస్టాండు సమీపంలో తొలినాళ్లలో చేపట్టారు. సిటీ మార్కెట్ నుంచి బెళ్లందూరు వరకు 92 కిలోమీటర్ల కాలువను అభివృద్ధి చేసేందుకు రూ.250 కోట్లు కేటాయించారు. యడియూరప్ప అధికారంలో ఉన్నంత కాలం పనులు వేగంగా సాగించారు. ఆయన ముఖ్యమంత్రి స్థానం నుంచి దిగిపోయాక.. బసవ రాజ బొమ్మై పీఠం ఎక్కినా మందకొడిగా పనులు సాగాయి. ప్రస్తుతం శాంతినగర బస్టాండు నుంచి 50 కిలోమీటర్ల వరకు పనులు పూర్తి చేశారు. కాలువకు ఇరువైపులా ప్రజలు నడవడానికి వీలుగా దారి, మధ్యలో పూల మొక్కల అమరిక ఆకట్టుకునే అంశాలు. ఆబాటల వెంట విద్యుత్తు దీపాలను అమర్చారు. అక్కడక్కడ పడవ ప్రయాణానికి.. వాటిని ఆపడానికి ఏర్పాట్లు చేశారు. బాలల కోసమే దీని ఒడ్డున విజ్ఞాన వనాన్ని నిర్మించారు. త్వరలోనే ఇవన్నీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది.



కాలువకు ఇరువైపులా నడకదారి.. మొక్కల పెంపకం

పోటీ పరీక్షల్లో సంస్కరణలు

● యూపీఎస్‌సీ తరహాలో కేపీఎస్‌సీ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలోనే కేపీఎస్‌సీ పరీక్షలు నిర్వహించేందుకు సంస్కరణ చర్యలు తీసుకురావాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులు, మంత్రులకు సూచించారు. కేపీఎస్‌సీ ద్వారా చేపడుతున్న నియామకాల ప్రగతిపై అధికారులు, మంత్రులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ కర్ణాటక విభాగంలో 371 జె-అధికరణకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఎదురయ్యే అడ్డంకులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నియామకాలను వేగంగా పూర్తి చేయడం, సిబ్బంది కొరతను పరిష్కరించుకునేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రివర్గం ఉపసమితి ఇచ్చే సిఫార్సులు, సూచనలను జాప్యం లేకుండా పూర్తిగా అమలు చేయాలని ఆదేశించారు. ఆయా ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా ప్రకటించిన అనంతరం, అభ్యర్థులు అర్హత ప్రమాణపత్రాన్ని ఇవ్వడం జాప్యం చేస్తే, నియామకం కూడా ఆలస్యమవుతుందన్నారు. సమావేశంలో మంత్రులు డాక్టర్ పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్, ఈశ్వర ఖండ్రే, కె.సుధాకర్, డాక్టర్ ఎంసీ సుధాకర్, బోసురాజు, రహింఖాన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్, అడ్వకేట్ జనరల్ శశికిరణ్ శెట్టి, ముఖ్యమంత్రికి అదనపు ప్రధాన కార్యదర్శి ఎల్‌కే అతీక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులు, మంత్రులతో సిద్ధరామయ్య, పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్

సిద్ధు పీఠాన్ని వీడాల్సిందే

● భాజపా నేత విజయేంద్ర జోస్యం

బెంగళూరు (మల్లేశ్వరం): మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అక్రమాల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసి, విచారణను ఎదుర్కోనడం తప్పనిసరని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర జోస్యం చెప్పారు. సిద్ధరామయ్య ఎంత మొండిగా వ్యవహరించినా, పీఠాన్ని వీడవలసిందేనన్నారు. పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతిని పురస్కరించుకుని పార్టీ ప్రధాన కార్యాలయం 'జగన్నాథభవన్'లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తాను రాజీనామా ఎందుకు చేయాలని ముఖ్యమంత్రి ప్రశ్నించడం హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రికి తన భార్య, కుటుంబ సభ్యులు చేస్తున్న లావాదేవీల విషయం తెలియకుండా ఉంటుందా అని న్యాయస్థానం ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. తాము రాజకీయ కక్షసాధింపుగా పోరాటం చేయలేదని, న్యాయపోరాటం మాత్రమే చేస్తున్నామని చెప్పారు. మాజీ మంత్రి ఈశ్వరప్పను మళ్లీ భాజపాలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను పార్టీ హైకమాండ్ ఇప్పటికీ ప్రారంభించలేదన్నారు. ఈశ్వరప్పను యత్నాళ్, మరికొందరు కలసిన విషయం తనకు తెలియదన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఈశ్వరప్పతో తాను ప్రస్తుతం మాట్లాడడం లేదని స్పష్టం చేశారు.

వైద్య పరీక్షలు..వైద్య శిబిరంలో పార్టీ నాయకులు చలువాది నారాయణ స్వామి, మురుగేశ్ నిరాణి, భారతిశెట్టి, రవికుమార్, ధనుంజయ సర్జి, శరణు తళ్లికేరి తదితరులు రక్తపోటు, దంత, నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. కిద్వాయి, మెట్రోపోలిస్‌తో పాటు వివిధ సంస్థల వైద్యులు, వైద్యేతర సిబ్బంది ఆరోగ్య పరీక్షలను చేశారు. దీనదయాళ్ ఉపాధ్యాయతో పాటు, ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి ప్రారంభించిన వివిధ సేవా కార్యక్రమాలను అక్టోబరు మొదటి వారం వరకు అన్ని జిల్లా, తాలూకా కేంద్రాలలో నిర్వహిస్తున్నామని విజయేంద్ర తెలిపారు.

నైపుణ్య శిక్షణతో అంకుర సంస్థల ఏర్పాటు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: వృత్తిపర కోర్సుల్లో చదివే విద్యార్థులు నైపుణ్య శిక్షణతో అంకుర సంస్థలను ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి అవకాశాలను కల్పించవచ్చని దావణగెరె విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ బసవరాజ్ కుంబార్ పేర్కొన్నారు. బుధవారం బీఐటీఎస్ హైటెక్ కళాశాల స్నాతకోత్సవంలో బీసీఏలో ఉత్తీర్ణులైన 87 మంది అభ్యర్థులకు స్నాతకోత్సవ పట్టాలను అందజేశారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకు పరిమితమై ఉత్తమ మార్కులను గడిస్తే చాలదని, తమ వృత్తిలో రాణించడానికి నైపుణ్యాలు, కౌశల్యాలను సొంతం చేసుకోవాలన్నారు. దేశంలో అంకుర సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఉన్నత శిక్షణ పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.ఆర్.నిరంజన్, క్రిమినాలజీ విభాగం విశ్రాంత అధ్యాపకుడు నటరాజ్, గణిత స్నాతకోత్తర విభాగాధిపతి గట్టి, కళాశాల ప్రిన్సిపల్ కవిత, కళాశాల సంస్థాపకుడు రవీంద్ర, కార్యదర్శి బసప్ప పాల్గొన్నారు.



విద్యార్థుల స్నాతకోత్సవంలో పట్టాలను పొందిన విద్యార్థులతో ప్రముఖులు

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



విద్యార్థులకు గుడ్లు వడ్డిస్తున్న అధ్యక్షురాలు రేణుకమ్మ, అధికారులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని విద్యాశాఖాధికారి గురప్ప పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యా శాఖ, సాక్షరత, అక్షరదాసోహ, మధ్యాహ్న భోజన పథకం కింద అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహ భాగత్వంలో పాఠశాల పిల్లల పౌష్టికతను పెంచేందుకు వారంలో ఆరు రోజులు గుడ్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ ప్రారంభించారు. పిల్లలకు మధ్యాహ్న భోజనంలో గుడ్లు వడ్డించి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాశాఖాధికారి గురప్ప మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు చదివే పిల్లల్లో పౌష్టికాహార లోపం ఎక్కువ సంఖ్యలో ఉండటాన్ని గుర్తించి ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతో పాటు అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ బెంగళూరు సహకారంతో వారంలో ఆరు రోజులు పాటు గుడ్లు, అరటిపండు, వేరుసెనగ చిక్కీ అందిస్తోందన్నారు. అక్షర దాసోహ మధ్యాహ్న భోజన శాఖ సహాయక నిర్దేశకుడు రామ్‌మోహన రావు మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా 1 నుంచి 10వ తరగతి వరకు 34,820 మంది విద్యార్థులు, ఎల్‌కేజీ నుంచి యూకేజీ వరకు 1,383 మంది విద్యార్థులు అందిస్తామని పేర్కొన్నారు. విద్యా శాఖ సంయోజకుడు తమ్మనగౌడ పాటిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్ శెట్టి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతుల వైపు అడుగేయండి



డ్రోన్ ఉపయోగంపై రైతులకు అవగాహన

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి భారతీయ మట్టి, నీటి సంరక్షణ, పరిశోధన కేంద్రం (ఐసీఎఆర్) ఆధ్వర్యంలో డ్రోన్ సాయంతో పంటల పొలాలకు రసాయన ఔషధాలు పిచికారీ నిర్వహించి, రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డా.రవి దూపదాల్, డా.ఎన్.రవి, డా.ఎన్.ఎం. అనషా నేతృత్వంలో బళ్లారి తాలూకా సోమసముద్రం, లక్ష్మీనగర్ క్యాంపులో సాగు చేసిన మిరప, వరి, మొక్కజొన్న, తదితర పంటలకు డ్రోన్ సాయంతో రసాయన ఔషధాలను పిచికారీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. సోమసముద్రం, లక్ష్మీనగర క్యాంపు, కోళూరు, మదిరె, కృష్ణానగర క్యాంపు, భాగ్యనగర క్యాంపు, శ్రీధరగడ్డ గ్రామాల నుంచి 49మందికిపైగా రైతులకు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డా.ఎం.ఎన్.రమేష్ మాట్లాడుతూ డ్రోన్ సాయంతో రసాయన ఔషధాలు పిచికారీ చేస్తే నేరుగా పైర్లకు వ్యాపించిన క్రిమికీటకాలపై పడి తెగుళ్ల తగ్గుముఖం పడతాయన్నారు. సమయం కలిసి రావడం, కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులు డ్రోన్లను అద్దెకు తీసుకుని రసాయన ఔషధాలను పిచికారీ చేసుకోవచ్చన్నారు. ఐసీఎఆర్ సంస్థ ఆధ్వర్యంలో 100 రోజులపాటు ఈ ప్రాంత రైతులకు డ్రోన్లతో రసాయన ఔషధాల పిచికారీపై అవగాహన కల్పిస్తామన్నారు.



మొక్కజొన్నకు ఔషధాలను పిచికారీ చేస్తున్న డ్రోన్



మ్యూజియంను సందర్శించిన డా॥ పత్తిపాక మోహన్

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలుగు భాష రచయిత డా॥ పత్తిపాక మోహన్ బుధవారం నగరంలోని కన్నడ సముచ్ఛయ భవనం ఆవరణలో ఉన్న రాబర్ట్ బ్రూస్‌ఫ్రూట్ సంగనకల్లు శిలాయుగం మ్యూజియంను సందర్శించారు. మ్యూజియం సభ్యులు అహిరాజ్, డా.శివలింగప్ప బళ్లారి తాలూకా సంగనకల్లు కొండలో సేకరించిన శిలాయుగంలోని పరికరాలు, ఇతర వస్తువుల వివరాలు తెలియజేశారు.

- న్యూస్‌టుడే, బళ్లారి

అంతర్రాష్ట్ర చోరుల అరెస్టు

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: మొళకాల్మూరు పోలీసు ఠాణా అధికారులు ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.20 లక్షల విలువైన టిప్పర్, టాటా సుమో, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు చెళ్లకెర డీవైఎస్పీ రాజణ్ణ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సహోదరులు మహేశ్, ప్రభాకర్‌ను అరెస్టు చేశారు. ఈ నెల 12న రాత్రి మొళకాల్మూరు గుత్తేదారు గోవిందరాజ్‌కు చెందిన రూ.12 లక్షల విలువైన టిప్పర్ లారీని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటనపై బాధితుడు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు చోరీకి గురైన టిప్పర్‌ను సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా ఉరవకొండ వద్ద పొలంలో దాచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకొన్నారు. నిందితులు మహేశ్, ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. వారు అందించిన సమాచారం మేరకు కొప్పళలో చోరీ చేసిన రూ.6.20 లక్షల విలువైన టాటా సుమో, రూ.1.80 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. నిందితులు హొసపేటలో టిప్పర్ లారీల చోదకులుగా పనిచేసిన అనుభవంతో చిత్రదుర్గం, బళ్లారి, కొప్పళ, దావణగెర, హావేరీ, విజయనగర, అనంతపురం జిల్లాలో పదికిపైగా వాహనాలను చోరీ చేసి విక్రయించారన్నారు. బళ్లారి కౌల్‌బజార్ పోలీసు ఠాణా పరిధిలో నమోదైన వాహనాల చోరీ కేసులో పోలీసులకు చిక్కిన నిందితులు జైలుశిక్ష అనుభవించి బయట పడినట్లు చెప్పారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తమ చోరీ వృత్తిని కొనసాగించారన్నారు. నిందితులను అరెస్టు చేసిన ఇన్‌స్పెక్టర్ వసంత ఆసూదే, పీఎస్ఐ పాండురంగ, నేర నియంత్రణ విభాగం పీఎస్ఐ ఈరేశ తదితరులను జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు అభినందించారు.

భాషబాంధవ్యం నిరంతరం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రాచీన కాలం నుంచి భాషబాంధవ్య వినిమయం నిరంతరంగా సాగుతోందని కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత డా.పత్తిపాక మోహన్ పేర్కొన్నారు. కన్నడ సాహిత్య పరిషత్తు ఆధ్వర్యంలో కసాప భవనంలో ఏర్పాటు చేసిన భాషబాంధవ్య అనే చర్చావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కన్నడ పుస్తకాలు, తెలుగులోకి, తెలుగు పుస్తకాలు కన్నడలోకి అనేకం అనువాదమయ్యాయన్నారు. ప్రస్తుతం సాహిత్యంలో అందరూ ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలతో బాంధవ్యం పెరుగుతోందన్నారు. పిల్లలకు పుస్తకాలు చదివించడం, కవితలు రాయడంపై అవగాహన కల్పించాలన్నారు. మాతృభాషలో పట్టు సాధించినప్పుడే ఇతర భాషల్లో రాణించగలరని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. చర్చావేదికలో శివలింగప్ప పలు ప్రశ్నలను సంధించారు. విశ్రాంత ఉపన్యాసకుడు, రచయిత మాడసాల రామాంజనేయులు, నాటక రచయిత రఘురామ్, కసాప జిల్లా అధ్యక్షుడు నిష్టిరుద్రప్ప, వెంకమ్మ, డా.అరవిందపాటిల్, అరుణ్, వీరేష్, అహిరాజ్, మంజునాథ్ పాల్గొన్నారు.



భాషబాంధవ్యం కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలుగు సాహితీవేత్త డా.పత్తిపాక మోహన్

హనుమంత చిత్రానికి బంగారు పతకం

గంగావతి,న్యూస్‌టుడే: కొప్పళ జిల్లా బండి హర్లాపురకు చెందిన ఛాయాచిత్ర గ్రాహకుడు హనుమంత తీసిన చిత్రం బంగారు పతకం సాధించింది. కర్ణాటక ఫొటోగ్రాఫర్ల సమాఖ్య నిర్వహించిన జాతీయ స్థాయి ఛాయాచిత్రాల పోటీలో వెడ్డింగ్ క్యాండిడ్ విభాగంలో ఈ చిత్రం ఎంపికైంది. 108 మంది ఛాయాచిత్ర గ్రాహకులకు చెందిన 603 చిత్రాలు ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలు గురుదాస్, దినేశ్‌ప్రసాద్, త్రిప్తి రాయ్ తన చిత్రాన్ని ఎంపిక చేసినట్లు హనుమంత తెలిపారు.



ఛాయాచిత్ర గ్రాహకుడు హనుమంత



వెడ్డింగ్ క్యాండిడ్‌లో బంగారు పతకం పొందిన చిత్రం

సిద్ధరామయ్యకు మద్దతుగా మౌన ప్రతిఘటన

బళ్లారి, న్యూస్‌టుడే: గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా నడుచుకోవడం, భాజపా, జేడీఎస్ పార్టీల కుతంత్ర రాజకీయాలను ఖండిస్తూ కర్ణాటక అంటరాని సముదాయ మహా ఒక్కూట ఆధ్వర్యంలో బుధవారం మౌన ప్రతిఘటన నిర్వహించారు. ఒక్కూట అధ్యక్షుడు గాదిలింగన గౌడ నేతృత్వంలో మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజు, జిల్లా పంచాయతీ మాజీ సభ్యులు ఎ.మానయ్య, బుడా మాజీ అధ్యక్షుడు హుమాయూన్ ఖాన్, కేపీసీసీ వ్యాఖ్యాత వెంకటేశ్ హెగ్డె, సభ్యులు కెరకోడప్ప, మోహన్, గాదెప్ప, విజయకుమార్, దురుగప్ప, ఎరుకుల స్వామి, బి.ఎం.రఫీ, కనక, శివశంకర్ తదితరులు చేతులకు నల్ల రుబ్బన్లు కట్టుకొని స్థానిక గడిగి చెన్నప్ప కూడలి నుంచి డీసీ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. డా.రాజ్‌కుమార్ ఉద్యానవనం ప్రధాన ద్వారం వద్ద ఉన్న గాంధీ విగ్రహం ముందు బైఠాయించారు. రాష్ట్రంలో వెనకబడిన వర్గాలకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడాన్ని జీర్ణించుకోకపోవడం, అన్ని వర్గాలకు అందజేస్తున్న గ్యారంటీలను ఓర్వలేక కేసులు పెట్టి విచారణకు అనుమతి ఇవ్వడం సరికాదన్నారు.



గాంధీ విగ్రహం ముందు మౌన ప్రతిఘటన చేస్తున్న కాంగ్రెస్ మద్దతుదారులు

ఆడపిల్లల చదువులు ఇంటికి వెలుగు




జాతాను ప్రారంభిస్తున్న ఎస్పీ శోభారాణి, తదితరులు



మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజేశ్ ఎన్.హొసమని

బళ్లారి, న్యూస్‌టుడే: ఆడపిల్లలు చదువుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా పోలీస్ అధికారి వి.జె.శోభారాణి పేర్కొన్నారు. రీడ్స్ సంస్థ, బాలలు విశేష పోలీస్ విభాగం, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బి.డి.ఎ.ఎ. సభాభవనంలో బాల్య వివాహాల నిషేధం, లింగ వివక్షత, బాలలపై దౌర్జన్యం నిషేధంపై ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. ఆర్.టి.ఇ.-2009 చట్టం ప్రకారం విద్య అనేది ఎంపిక కాదు. అది మన హక్కు. ప్రతి మహిళ విద్యావంతురాలైతే సమాజం ఆర్థిక, రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. యవ్వనంలో ఆడపిల్లలు ఎలాంటి ఆకర్షణలకు లోను కావద్దు. జీవిత పరమార్థాన్ని గ్రహించి ఇంటికి, గ్రామానికి, తల్లిదండ్రులు, గురువులకు కీర్తిప్రతిష్ఠలు తీసుకుని రావాలని సూచించారు. బాల్య వివాహాలు, లింగ వివక్ష, పిల్లలపై దౌర్జన్యం తదితరాలను సమాజం నుంచి తరిమివేయడానికి విద్య ఒక్కటే సరైన ఆయుధమని తెలిపారు. బాలల రక్షణ కోసం ప్రతి జిల్లాలో డీఎస్పీ, సీఐ, పి.ఎస్.ఐ., మహిళ పోలీస్ కానిస్టేబుల్‌పాలు ప్రత్యేక బాలల పోలీస్ విభాగం ఉందన్నారు. జిల్లాలో బాల్య వివాహల కేసులు, పెరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. బాల్య వివాహాలు, ఇతర సమస్యలు ఉంటే బాలల హెల్ప్ లైన్ నంబరు 1098, మహిళ సహాయవాణి 181, అత్యవసర మహిళా హెల్ప్ నంబరు 112కు ఫోన్ చేసిన 15 నిమిషాల్లో మీ వద్దకు చేరుకుంటారని తెలిపారు. జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి రాజేశ్ ఎన్.హొసమని మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో పురుషులతో పాటు మహిళలు కూడా అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలుస్తున్నారు. సాధన చేయాలని విషయం మహిళల్లో దృఢంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రేమ-పెళ్లి కేసుల్లో యువకుల జీవితాలు నాశనం అవుతున్నాయి. అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్య ద్వారా నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించాలన్నారు. సమాజంలో ఉన్నతస్థితిని సాధించాలని విద్యార్థులకు సూచించారు. న్యాయవాది శివలీల, విశ్రాంత తాలూకా వైద్య అధికారి మోహన్‌కుమారి, సి.ఐ.సుభాష్ చంద్ర, గాంధీనగర్ సి.ఐ. సిద్ధరామేశ్వర కడేద, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సి.ఐ. అయ్యనగౌడ వివిధ విషయాలపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఏఎస్పీ నవీన్‌కుమార్, డీఎస్పీ చంద్రశేఖర్ నందారెడ్డి, రైల్వే పోలీస్ అధికారి విజయలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి నాగప్ప, రీడ్స్ సంస్థ కార్యనిర్వాహక నిర్దేశకులు సి.తిప్పేశప్ప, సీతామహలక్ష్మి, జగతాప్, తిప్పేస్వామి, కళాశాల విద్యార్థులు, వివిధ మహిళ స్వయం సేవా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

దేవదాసీలు సంఘంలో తలెత్తుకుని తిరగాలి



దేవదాసీ పద్ధతి నిర్మూలనకు కృషి చేస్తామని ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న యువతులు

హొసపేటె, న్యూస్‌టుడే: దేవదాసీలు సంఘంలో తలెత్తుకుని తిరిగే వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ పేర్కొన్నారు. స్థానిక సఖీ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన దేవదాసీలు, వారి పిల్లల ఘనత, సుస్థిరతపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పద్ధతి ప్రస్తుతం ఆచరణలో లేదు. అయినప్పటికీ జిల్లాలో సుమారు పది వేల మంది దేవదాసీలు ఉన్నారంటే ఆశ్చర్యంగా ఉందని అన్నారు. కుటుంబంలో పేదరికం, నిరక్షరాస్యత ఈ పద్ధతి ఆచరణకు దారి తీస్తున్నాయని అన్నారు. తెలిసీ, తెలియక ఈ పద్ధతిలో అడుగు పెట్టారు. మీ పిల్లల భవిష్యత్తయినా బాగుపడేలా కృషి చేయాలని ఆయన దేవదాసీలకు పిలుపునిచ్చారు. సమాజంలో జాగృతి తీసుకురావడంతో దేవదాసీ పద్ధతిని నిర్మూలించటానికి సాధ్యపడుతుందన్నారు. దేవదాసీ పిల్లలకు పాఠశాల, వసతి శాలల్లో రిజరేషన్ ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎస్పీ శ్రీహరి బాబు మాట్లాడుతూ దేవదాసీ నిర్మూలన చట్టం-1982 నేటికీ అమలులో ఉంది. అలాంటి ఘటనలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం అందితే, కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బెంగళూరు జాతీయ న్యాయశాస్త్ర కళాశాల ప్రాధ్యాపకుడు డాక్టర్ ఆర్.వి.చంద్రశేఖర్, సఖీ ట్రస్టు సంచాలకురాలు డాక్టర్ భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. దేవదాసీ పిల్లల పైచదువులకు ఆర్థిక సాయం చెక్కు అందించారు. కొంత మంది దేవదాసీలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు

నిహారికా.. యోగాలో తఢాఖా



కొప్పళ జిల్లా కుష్టగిలో నిర్వహించిన యోగా పోటీల్లో నిహారికా ప్రథమ స్థానం పొంది కలబురగి విభాగ స్థాయికి ఎంపికైంది. ఆమె గంగావతి లిటిల్‌హార్ట్స్ పాఠశాలలో ఆరో తరగతి అభ్యసిస్తోంది. పోటీల్లో మిగిలిన విద్యార్థులతో పోటీపడి చక్కటి విన్యాసాలను ప్రదర్శించింది. విద్యా సంస్థ కార్యదర్శి జగన్నాథ్ అలంపల్లి, ప్రధానోపాధ్యాయురాలు ప్రియాకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు సోమశేఖర్ అభినందించారు.

పోషణ్ అభియాన్‌పై సమాచార ప్రదర్శన



కేంద్ర పథకాల సమాచార ప్రదర్శనను ప్రారంభిస్తున్న హడగలి ఎమ్మెల్యే కృష్ణానాయక్

హొసపేటె: కేంద్ర సమాచార, ప్రసార శాఖ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, వైద్యశాఖలు విజయనగర జిల్లా హూవిన హడగలిలో బుధవారం ఏర్పాటు చేసిన పోషణ్ అభియాన్ కార్యక్రమం ఆకట్టుకుంది. స్థానిక ఎమ్మెల్యే కృష్ణానాయక్ అభియాన్‌ను ప్రారంభించారు. కేంద్ర మాధ్యమ సమాచార సంస్థ బెంగళూరు ముఖ్యుడు ఎస్.జి.రవీంద్ర, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు శ్వేతా తదితరులు పాల్గొన్నారు. పిల్లలు, గర్భిణి, బాలింత ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాచారాన్ని తెలిపే వస్తు ప్రదర్శన ఆకట్టుకుంది.

నేడు అక్కినేని పురస్కార ప్రదాన కార్యక్రమం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: అక్కినేని నాగేశ్వరరావు జయంతిని పురస్కరించుకుని సమతాసాహితీ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రాఘవ సంగీతభవన్‌లో అక్కినేని పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు డా.సురేంద్రబాబు తెలిపారు. సీనియర్ రంగస్థల కళాకారులకు అక్కినేని స్మారక కళాపురస్కారాలను అందజేస్తామని ఆయన చెప్పారు. మా సంస్థ ఆధ్వర్యంలో వీటిని అందజేస్తున్నామన్నారు. కళా,సాహితీప్రియులు, సంస్థ సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

లారీ చోదకుడి దుర్మరణం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హిరియూరు తాలూకా జవనగొండన హళ్లి గ్రామం వద్ద బెంగళూరు-పుణె జాతీయ రహదారి నంబరు 48లో ముందు వెళ్తున్న ట్యాంకర్ లారీని వేగంగా దూసుకొచ్చిన లారీ వెనుక వైపున ఢీకొన్న సంఘటన బుధవారం మధ్యాహ్నం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ దుర్ఘటనలో లారీ చోదకుడు లారీ క్యాబిన్‌లోనే చిక్కుకొని మృతి చెందారు. చోదకుని మృత దేహాన్ని బయటకు తీయడానికి పోలీసులు గ్యాస్ కట్టర్లను ఉపయోగించాల్సి వచ్చింది. జాతీయ రహదారిలో కొద్దిసేపు వాహన సంచారానికి అంతరాయం కలిగింది. మృతుని వివరాలు తెలియలేదని పోలీసులు తెలిపారు.

పురుగుమందు తాగి యువకుడి మృతి

హొసపేటె: మద్యం మత్తులో వెట్టి రవి(22) అనే యువకుడు పురుగుమందు తాగి మృతిచెందిన ఘటన హగరిబొమ్మనహళ్లి తాలూకా యద్రామనహళ్లిలో జరిగింది. ఆ ప్రాంతానికి చెందిన యువకుడు వ్యవసాయ కూలీ వెట్టిరవి ఇటీవలే తాగుడుకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అతిగా తాగి ఇంటికొచ్చాడు. అదే మత్తులో ఇంట్లో పెట్టిన పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతతో ఉన్న ఆయన్ను కొప్పళ జిల్లాస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హగరిబొమ్మనహళ్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

గోతిలో బోల్తాపడిన ఆర్టీసీ బస్సు



గోతిలో బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

హొసపేటె, న్యూస్‌టుడే: చోదకుడి అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు గోతిలోకి దూసుకెళ్లి బోల్తాపడిన ఘటన బుధవారం హగరిబొమ్మనహళ్లి తాలూకా మాలవి వద్ద జరిగింది. హొసపేటె నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని శివమొగ్గకు వెళ్తున్న బస్సు చోదకుడు ముందు వెళ్తున్న ఓ వాహనాన్ని అధిగమించే ప్రయత్నం చేయగా, ఎదురుగా ఓ లారీ వచ్చింది. అదుపు తప్పడంతో బస్సును ఓ గోతిలోకి దింపగా, నెమ్మదిగా ఓ పక్కకు ఒరిగింది. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. ఆ సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే హగరిబొమ్మనహళ్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రయాణికులను వేరే బస్సులో పంపారు.

గనినాడుపై ప్లాస్టిక్ పంజా

➤ ఇష్టారాజ్యంగా వినియోగం ➤ నామమాత్రపు చర్యలతో పాలికె అలసత్వం



రూపనగుడి రహదారిలోని రాజు కాలువలో పేరుకుని పోయిన ప్లాస్టిక్ కవర్లు

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల విక్రయాలు గనినాడు బళ్లారిని ముంచెత్తుతున్నాయి. నగర పాలికె కార్యాలయం ముందే వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో పాలికె కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారిణి ప్రీతి గహ్లోత్ ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపారు. అనంతరం వచ్చిన కమిషనర్లు, మేయర్, ఉప మేయర్లు ప్లాస్టిక్ నియంత్రణ చర్యలపై దృష్టి సారించలేదనే ఆరోపణలు ఉన్నాయి.

నగరంలో ఉత్పత్తుల తయారీ

నగరంలో 75 మైక్రాన్ల మందమున్న కవర్ల తయారు చేసే రెండు పరిశ్రమలకు మాత్రమే కాలుష్య నియంత్రణ మండలి అనుమతి మంజూరు చేశారు. వాడి పడేసే (యూజ్ అండ్ త్రో) కవర్లు, ప్లాస్టిక్ గ్లాసు, తట్టలు, కరపత్రాలు, తోరణాలు, ఫ్లెక్సీలు, జెండాలు, స్ట్రాలు, ఆహార పదార్థాలను పార్సిల్ చేసే పెట్టెలు, ఇతర వస్తువులు నగర శివారు ప్రాంతమైన పారిశ్రామిక ప్రాంతంలో తయారవుతున్నాయి. బళ్లారి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉండటం వల్ల కొత్త పరిశ్రమలు పుట్టుకొచ్చాయి. అక్కడి నుంచి బళ్లారి నగరంలో వ్యాపారులకు సరఫరా చేస్తున్నారు. కిరాణా దుకాణాలు, వస్త్రాలు, బేకరీ, హోటళ్లలో వాడి పడేసే కవర్లు లభించడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహార పదార్థాల విక్రయించే తోపుడు బండ్ల వారు, కూరగాయలు, పండ్ల వ్యాపారులు అతి తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారు. నిత్యం నగర పాలికె కార్యాలయం చుట్టూ ఉన్న తోపుడు బండ్లలో వాడివేసే కవర్లు లభిస్తున్నాయి. పాలికె అధికారులు ప్లాస్టిక్ వస్తువుల విక్రయించే దుకాణాలపై నామమాత్రంగా దాడులు చేస్తున్నారు.



కవర్లలో సరకులు తీసుకెళ్తున్న వ్యక్తి

వాతావరణంపై తీవ్ర ప్రభావం

తక్కువ మైక్రాన్ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని పర్యావరణ ఇంజినీర్లు చెబుతున్నారు. వేడి వేడి ఆహార పదార్థాలను కవర్లలో తీసుకుని వెళ్తున్నారు. కవర్లను ఇష్టారాజ్యంగా పడేస్తుండటంతో భూమిలో కలుష్య కారకాలు పెరిగిపోతున్నాయి. నగరంలో రాజ కాలువలు, మురుగు కాలువలు ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి ఉంటాయి. వర్షపునీరు ముందుకు వెళ్లలేక సమీపంలోని కాలనీల్లోకి చేరుతున్నాయి. ఇటీవల మృతిచెందిన ఓ పశువుకు శస్త్రచికిత్స చేస్తే 40 కిలోలకుపైగా ప్లాస్టిక్ కవర్లు బయట పడ్డాయి.

అరకొర చర్యలతో..

నగర పాలికెలో వాడి పడేసే కవర్లు విక్రయిస్తున్నా... యథేచ్ఛగా వాడుతున్నా పాలికె అధికారులు నామమాత్రపు దాడులు చేస్తున్నారు. ఆగస్టులో మేయర్ ముల్లంగి నందీష్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అధికారులు కొద్దిగా దాడులు ప్రారంభించారు. ఆగస్టులో 170 దాడులు చేసి 66.5 కిలోల ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని రూ.26,900 జరిమానా విధించారు. సెప్టెంబరు 24 వరకు 166 దాడులు చేసి 75.5 కిలోల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకుని రూ.43,200 జరిమానా విధించారు. 2023 ఏడాదిలో సుమారు 1000కిపైగా దాడులు చేసి విక్రేతలపై రూ.12,38,050 రుసుం వసూలు చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సరఫరా అవుతున్న వాటిపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. నగర శివార్లలో గుట్టుచప్పుడు కాకుండా తయారు చేస్తున్న కంపెనీలపై దాడులు చేయడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్లాస్టిక్ భూతాన్ని అరికట్టాలని నగరవాసులు కోరుతున్నారు.



రాణితోట మీదుగా వెళ్తున్న రాజకాలువలో ప్లాస్టిక్ వస్తువులు



నిషేధించిన ప్లాస్టిక్ గ్లాసులు స్వాధీనం

హగరిబొమ్మనహళ్లి పురసభపై కాంగ్రెస్ జెండా



హగరిబొమ్మనహళ్లి పురసభ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మరిరామప్ప, అంబికా

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి పురసభ కాంగ్రెస్ వశమైంది. బుధవారం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీకి చెందిన సభ్యులు మరిరామప్ప, అంబికా ఎన్నికయ్యారు. పురసభపై జెండా ఎగుర వేయటానికి భాజపా కూడా తీవ్ర కసరత్తులు చేసినా, ఫలితం దక్కలేదు. కాంగ్రెస్- 12, భాజపా-11 మంది సభ్యులుండగా, ఇద్దరు భాజపా సభ్యులు కాంగ్రెస్‌కు మద్దతు పలకడంతో భాజపాకు నిరాశ ఎదురైంది. అధ్యక్ష స్థానానికి కాంగ్రెస్ నుంచి మరిరామప్ప, భాజపా నుంచి సురేశ్ బణకార్ నామినేషన్ దాఖలు చేశారు. బళ్లారి ఎంపీ, ఇద్దరు భాజపా సభ్యుల మద్దతుతో 15 మంది సభ్యుల బలగంతో కాంగ్రెస్ సభ్యుడు మరిరామప్ప ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష పదవి ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. బళ్లారి ఎంపీ ఇ.తుకారాం, మాజీ ఎమ్మెల్యే భీమానాయక్ పాల్గొన్నారు. తహసీల్దార్ కవితా ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

పౌర కార్మికుల సేవలు నిరూపమానం



పౌరకార్మికుల దినోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అధ్యక్షురాలు రేణుకమ్మ, తదితరులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: పౌర కార్మికుల సేవలు నిరూపమానమైనవని నగరసభ కమీషనర్ గురుప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం కర్ణాటక రాష్ట్ర పౌర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పౌర కార్మికుల దినోత్సవాన్ని ఆచరించారు. నగరసభ అధ్యక్షురాలు బి.రేణుకమ్మ, ఉపాధ్యాక్షురాలు యశోద మూర్తి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరసభ కమిషనర్ గురుప్రసాద్ మాట్లాడుతూ పౌర కార్మికులు తెల్లవారుజామునే లేచి చలి, వాన, ఎండను లెక్క చేయకుండా రహదారులు, మురుగు కాల్వలు అన్నింటిని శుభ్రం చేసి పట్టణాన్ని సుందరంగా ఉంచేందుకు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారు. గృహాలు నిర్మించుకునేందుకు స్థలాల మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేపట్టింది, గృహాల నిర్మాణానికి రుణ సౌకర్యం కల్పిస్తుంది. దీనికి మా వంతు సహకారం, తోడ్పాటు అందిస్తామన్నారు. నగరసభ సభ్యులు, పౌరకార్మికుల సంఘం అధ్యక్షుడు కె. వెంకోబ, ఉపాధ్యక్షుడు రాజాభక్షి, కార్యదర్శి పంపాపతి, గౌరవ అధ్యక్షుడు అమరేష్, ఇంజినీర్ రమేష్, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

సంజీవని ఉద్యోగులపై ఆరోపణల్లో వాస్తవం లేదు



మాట్లాడుతున్న సంజీవని ఉద్యోగుల, లబ్ధిదారుల సంఘం రాష్ట్ర సంచాలకుడు నాగరాజ్

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా పంచాయతీల పరిధిలో సంజీవని ఉద్యోగులపై పలువురు సమాచార హక్కు కార్యకర్తలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవంలేదని సంఘం రాష్ట్ర సంచాలకుడు నాగరాజ్ కొట్టిపారేశారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగర జిల్లాలోని హరపనహళ్లి పరిధిలోని పలు పంచాయతీల్లో స్వసహాయ సంఘాల నిధులు దుర్వినియోగం అయ్యాయని కొందరు ఆరోపణలు చేస్తున్నారు. సంఘంలోని మహిళలు, వాటిని నిర్వహిస్తున్న సంజీవని ఉద్యోగులు తల దించుకుని తిరిగే పరిస్థితి దాపురించిందని వాపోయారు. స్వసహాయ సంఘాల రాబడి, ఖర్చులను మాత్రమే సంజీవని ఉద్యోగులు చూసుకుంటారు, డబ్బుల వ్యవహారమంతా స్వసహాయ సంఘాలే నిర్వహిస్తాయి. అలాంటప్పుడు అవినీతికి పాల్పడే అవకాశమే లేదని తేల్చిచెప్పారు. సంఘం ప్రముఖులు గౌరమ్మ, మాళమ్మ, భాస్కర్‌రెడ్డి, అంజినమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుడ్లు, పండ్లు పంపిణీ



గుడ్లు, అరటి పండ్లు చూపుతున్న విద్యార్థులు

మాన్వి, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా వారంలో నాలుగు రోజులు గుడ్డు తినలేని వారికి అరటి పండ్లు ఇస్తున్నట్లు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ తెలిపారు. బుధవారం నుంచి మాన్విలో ప్రారంభించినట్లు చెప్పారు. 240 మంది విద్యార్థులకు గుడ్లు, 270 మంది విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, చన్నబసవరాజ్, శేఖ్‌హుసేన్ రేఖాదేవి, విద్యావతి, రజిని, అన్వర్, నిర్వాహకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఉపన్యాసకులు, విద్యార్థులు

కనకగిరిలో స్వచ్ఛ సేవ

కారటగి: కనకగిరిలోని పంపణ్ణ శరణప్ప గొగ్గళశెట్రు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వారం రోజులుగా స్వచ్ఛ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రోజూ కొంతసేపు పట్టణంలోని వీధుల్లో ప్లాస్టిక్ వస్తువులు తొలగించి శుభ్రం చేస్తున్నారు. ప్రిన్సిపల్ బజరంగ బలి మాట్లాడుతూ కళాశాల జాతీయ సేవా యోజన (ఎన్ఎస్ఎస్) ఏ, బీ శాఖల ద్వారా ఈ కార్యక్రమం చేపడుతున్నాం. మొక్కలు సైతం నాటుతున్నాం. స్వచ్ఛత, ఆరోగ్యంపై ప్రజల్లో జాగృతి కలిగిస్తున్నామన్నారు. గాంధీ జయంతి వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జాతీయ సేవా యోజన అధికారి వీరేశ్ కెంగల్, ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హంపీలో అధికారుల శ్రమదానం



పర్యాటక దినోత్సవం సందర్భంగా హంపీలో చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం

హొసపేటె, న్యూస్‌టుడే: పర్యాటక దినోత్సవం నేపథ్యంలో పర్యాటక, కేంద్ర పురావస్తు, దేవాదాయ, ధర్మాదాయ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హంపీలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పర్యాటక శాఖ ఉప సంచాలకుడు ప్రభులింగ తళకేరి ప్రారంభించారు. హంపీ శుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. హంపీ బజార్, మాతంగ కొండ ప్రాంతాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లకంపలను ఏరిపారేశారు. హంపీ పంచాయతీ అధ్యక్షురాలు రజని, పురావస్తు శాఖ అధికారులు అనిరుద్ధ దేసాయి, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుల సేవలు అభినందనీయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీసీ సచిన్ తదితరులు

సింధనూరు, న్యూస్‌టుడే: మనిషి ప్రాణాలు కాపాడే ఔషధాల మోతాదులను కనుగొని, వాటి తయారీలో ప్రముఖ పాత్ర వహించే ఫార్మాసిస్టులు ప్రజా ఆరోగ్యంలో వెల కట్టలేని సేవలందిస్తారని రాయచూరు జిల్లా ఏడీసీ కె.సచిన్ పేర్కొన్నారు. స్థానిక పీడబ్ల్యూడీ క్యాంపులోని ఓ పారా మెడికల్ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని ఆచరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అసిస్టెంట్ డ్రగ్ కంట్రోలర్ సచిన్ మాట్లాడుతూ రోగికి ఆరోగ్యంపై సలహాలు ఇవ్వడం, పరీక్షలు చేసి వారికి వ్యాధి నయం అయ్యే వరకూ తగిన తర్ఫీదు ఇవ్వడం వంటివన్నీ ఫార్మాసిస్టులు చేస్తూ..ఆరోగ్యం మెరుగయ్యే పనిలో ఎల్లప్పుడూ నిమగ్నమై ఉంటారని వివరించారు. రాయచూరు వీఎన్‌సీపీ కళాశాల అధ్యాపకుడు జైహుద్దీన్, అధ్యక్షుడు ఇర్ఫాన్, నందిహాళ మఠం హనుమేశ్‌స్వామి పాల్గొన్నారు.

దసరా క్రీడా పోటీల్లో బాలికల సత్తా



పరుగు పోటీలో ఎంపికైన అక్షత, సౌజన్య

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: దసరా క్రీడల్లో భాగంగా మంగళవారం జరిగిన కొప్పళ జిల్లా స్థాయి బాలికల కబడ్డీ పోటీలో గంగావతి తాలూకా ఢణాపుర గ్రామ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి కలబురగి విభాగ పోటీలకు ఎంపికైంది. ఇదే గ్రామానికి చెందిన అక్షత వంద, 400 మీటర్ల పరుగు పోటీలో ద్వితీయ, 3 వేల మీటర్ల పరుగులో సౌజన్య ద్వితీయ స్థానాల్లో నిలిచి విభాగ పోటీలకు అర్హత సాధించారు. బుధవారం గ్రామంలో వీరిని అభినందించారు.



కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచి విభాగ స్థాయి పోటీలకు ఎంపికైన ఢణాపుర బాలికల జట్టు

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న డీహెచ్‌వో డా.యల్లా రమేష్ బాబు, చిత్రంలో వైద్యులు హనుమంతప్ప, మంజునాథ, అధికారి ఈశ్వర్ దాసప్పనవర

బళ్లారి, న్యూస్‌టుడే: గర్భిణులకు పరీక్షలు, చికిత్సను ఆలస్యం చేయకుండా నిర్దిష్ట సమయంలో నిర్వహించి, మాతా, శిశు మరణాలను తగ్గించాలని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డా.రమేష్‌బాబు ఆరోగ్య సిబ్బంది, ఆశాలకు సూచించారు. కురుగోడు తాలూకా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధ్వర్యంలో బుధవారం కురుగోడు పట్టణంలోని వాల్మీకి భవనంలో మాతా, శిశు మరణాలు నివారణపై ఏర్పాటు చేసిన ప్రగతి పరిశీలన సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులుగా గుర్తించిన తర్వాత వారిపై నిరంతరం ప్రత్యేక నిఘా పెట్టాలి. వారిలో అధిక రక్తపోటు, రక్తహీనత వంటి పరీక్షలు నిర్వహించి, తగిన చికిత్స చేయాలన్నారు. ఆర్.సి.హెచ్.అధికారి డా.హనుమంతప్ప మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రసవమైన తర్వాత నవజాత శిశువుకు తప్పకుండా తల్లిపాలు తాగించాలి. ఇలా చేస్తే శిశువులో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దీర్ఘకాల వ్యాధుల రాకుండా ముందుజాగ్రత్తగా వైద్యులు సలహాలతో టీకాలు, వ్యాక్సిన్లు వేయించాలన్నారు. డా.మంజునాథ, ఆరోగ్యశాఖాధికారిని రూప, ఆరోగ్య సిబ్బంది మంజునాథ, ఈశ్వర్ దాసప్పనవరు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హంపయ్యనాయక్

సిరివార, (మాన్వి) : నియోజకవర్గంలోని గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 1,7,8 వార్డులు, గొల్దిన్ని గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అంగన్‌వాడీల నిర్వహణ సరిగా ఉండాలన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తానని తెలిపారు. స్థానిక పట్టణ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌరకార్మికుల దినాచరణను ప్రారంభించారు. పట్టణాల పరిశుభ్రతకు పాటుపడే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్య ఏర్పడకుండా అధికారులు, కార్మికులు కృషి చేయాలని తెలిపారు. కార్మికులకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందించారు. పట్టణంలో కార్మికులు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను సత్కరించారు. దివ్యాంగులకు ప్రభుత్వం సమకూర్చిన వాహనాలను పంపిణీ చేశారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, తహసీల్దార్ భీమరాయ, పట్టణ పంచాయతీ ముఖ్యాధికారి తిమ్మప్ప జగ్లీ, సీడీపీఓ నాగరత్న, ఎస్సై అమరేగౌడ, ప్రముఖులు ఎన్.ఉదయ్‌కుమార్, రమేష్ దర్శన్‌కర్, శివశరణ సాహుకార్, పట్టణ పంచాయతీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ సేవా పథకంతో నాయకత్వ లక్షణాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వి.వి.సంఘం అధ్యక్షుడు అల్లం గురుబసవరాజు, చిత్రంలో వీఎస్కేయూ రిజిస్ట్రార్ రుద్రేశ్ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: సామాజిక సేవ అనేది మనందరి జీవితంలో భాగం..విద్యార్థి దశ నుంచి సేవాభావం అలవర్చుకొని నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేశ్ విద్యార్థులకు సూచించారు. బళ్లారి కొట్టూరు శిక్షణ మహావిద్యాలయంలో బుధవారం ఎన్.ఎస్.ఎస్. విభాగాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేడు బి.ఎడ్. చదువుతున్న విద్యార్థులు రేపు దేశ పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులు..వ్యక్తిత్వం వికాసం, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత తదితర అంశాలను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మాత్రమే నేర్చుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. పరిసరాల సంరక్షణ బాధ్యత కూడా విద్యార్థులు తీసుకుని కళాశాలను పచ్చతోరణంగా మార్చుకోవాలన్నారు. వీఎస్కేయూ క్రీడా శాఖ, ఎన్.ఎస్.ఎస్. అధికారి డా.కుమార్ మాట్లాడారు. కొట్టూరు శిక్షణ మహావిద్యాలయంలో ఎన్.ఎస్.ఎస్.ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వి.వి.సంఘం అధ్యక్షుడు అల్లం గురుబసవరాజు బ్యాడ్జిలను విద్యార్థులకు అందజేశారు. ప్రధాన ఆచార్యులు డా. సతీష్ హిరేమఠ్ కళాశాలలో చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. అధ్యాపకులు మల్లికార్జున, ప్రశాంత్‌కుమార్, మోహన్ పాల్గొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

25-09-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.86	1619.61
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	6,921	2,346
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,119	9,802
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.226	60.243

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు



, కోరమంగల రాజకాలువ విస్తరణ పనుల్లో వేగం



విజన్-20 పథకం కింద కొన్ని ప్రాంతాల్లో పనుల పూర్తి



కాలువలో పూలమొక్కల అమరిక ఇలా..

ఉద్యాననగరికి లండన్ మెరుపులు!

● మురుగుకాలువలకు మేలిమి హంగులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కంపుకొట్టే బెంగళూరు మురుగుకాలువలు ఆధునిక హంగులతో మెరిసిపోయే రోజులు సమీపించాయి. చారిత్రక లండన్ నగర థేమ్స్ నది అనుబంధ బకింగ్‌హాం కాలువ తరహాలో ఎన్నెన్నో అందాలను ఇక్కడి కాలువలకూ సొంతం చేసుకొంటున్నాయి. ఇప్పటికే కోరమంగల రాజకాలువను అభివృద్ధి చేసేందుకు బృహత్ బెంగళూరు మహానగర పాలికె 'విజన్-20' పథకం తెరపైకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇజ్రాయిల్ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పథకాన్ని చేపట్టారు. కాలువలో మురుగు ప్రవాహాన్ని నిలువరించడానికి శుద్ధీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రమాదకరం కాని నీరు ప్రవహించేలా చేస్తున్నారు. ఇక్కడ 120 ఎంఎల్‌డీ స్థాయి శుద్ధీకరణ విభాగం సాయంతో మంచి నీటినే కాలువలోకి విడుదల చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం పది ఎంఎల్‌డీ నీరు విడుదల చేస్తున్నట్లు పాలికె అధికారులు తెలిపారు. ఈ పథకాన్ని 2018లో అప్పటి ముఖ్యమంత్రి యడియూరప్ప ప్రారంభించారు. నిర్మాణ పనులను శాంతినగర బస్టాండు సమీపంలో తొలినాళ్లలో చేపట్టారు. సిటీ మార్కెట్ నుంచి బెళ్లందూరు వరకు 92 కిలోమీటర్ల కాలువను అభివృద్ధి చేసేందుకు రూ.250 కోట్లు కేటాయించారు. యడియూరప్ప అధికారంలో ఉన్నంత కాలం పనులు వేగంగా సాగించారు. ఆయన ముఖ్యమంత్రి స్థానం నుంచి దిగిపోయాక.. బసవరాజ బొమ్మై పీఠం ఎక్కినా మందకొడిగా పనులు సాగాయి. ప్రస్తుతం శాంతినగర బస్టాండు నుంచి 50 కిలోమీటర్ల వరకు పనులు పూర్తి చేశారు. కాలువకు ఇరువైపులా ప్రజలు నడవడానికి వీలుగా దారి, మధ్యలో పూల మొక్కల అమరిక ఆకట్టుకునే అంశాలు. ఆబాటల వెంట విద్యుత్తు దీపాలను అమర్చారు. అక్కడక్కడ పడవ ప్రయాణానికి.. వాటిని ఆపడానికి ఏర్పాట్లు చేశారు. బాలల కోసమే దీని ఒడ్డున విజ్ఞాన వనాన్ని నిర్మించారు. త్వరలోనే ఇవన్నీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది.



కాలువకు ఇరువైపులా నడకదారి.. మొక్కల పెంపకం

పోటీ పరీక్షల్లో సంస్కరణలు

● యూపీఎస్సీ తరహాలో కేపీఎస్సీ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలోనే కేపీఎస్సీ పరీక్షలు నిర్వహించేందుకు సంస్కరణ చర్యలు తీసుకురావాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులు, మంత్రులకు సూచించారు. కేపీఎస్సీ ద్వారా చేపడుతున్న నియామకాల ప్రగతిపై అధికారులు, మంత్రులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ కర్ణాటక విభాగంలో 371 జె-అధికరణకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఎదురయ్యే అడ్డంకులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నియామకాలను వేగంగా పూర్తి చేయడం, సిబ్బంది కొరతను పరిష్కరించుకునేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రివర్గం ఉపసమితి ఇచ్చే సిఫార్సులు, సూచనలను జాప్యం లేకుండా పూర్తిగా అమలు చేయాలని ఆదేశించారు. ఆయా ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా ప్రకటించిన అనంతరం, అభ్యర్థులు అర్హత ప్రమాణపత్రాన్ని ఇవ్వడం జాప్యం చేస్తే, నియామకం కూడా ఆలస్యమవుతుందన్నారు. సమావేశంలో మంత్రులు డాక్టర్ పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్, ఈశ్వర ఖండ్రే, కె.సుధాకర్, డాక్టర్ ఎంసీ సుధాకర్, బోసురాజు, రహీంఖాన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్, అడ్వకేట్ జనరల్ శశికిరణ్ శెట్టి, ముఖ్యమంత్రికి అదనపు ప్రధాన కార్యదర్శి ఎల్‌కే అతీక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులు, మంత్రులతో సిద్ధరామయ్య, పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్



మట్టిలో మొలకలను ఆసక్తిగా చూస్తున్న బాలలు



పండుటాకులు, వాడిన పూలను కలిపి ఎరువుగా చేస్తున్న విద్యార్థినులు

మట్టితోనే గట్టి భవిత

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణ, ఉద్యానవనాల పెంపకం, సొంతంగా ఎరువులను తయారు చేసుకోవడాన్ని విద్యార్థులకు బోధించేందుకు 'గ్లెన్ ట్రీ అకాడమీ' తమ సంస్థ ఆవరణలో భూపరిశోధన కేంద్రం (ఎర్త్ ల్యాబ్)ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ఈ ప్రయోగశాలను ప్రారంభించారు. చిన్నవయసు నుంచి మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ పట్ల ఆసక్తి పెంచితే.. అది జీవితాంతం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. బన్నేరుఘట్ట రోడ్డు హొమ్మదేవనహళ్లిలో మూడెకరాల్లో విస్తరించిన సంస్థ ఆవరణలో విద్యార్థులు నాటిన మొక్కలు, ఎరువులతోనే సాగు చేస్తున్నామని సంస్థ సీఓఓ రచనా హెడా తెలిపారు. 'లెర్నింగ్ ఫర్ లైఫ్' అనే నినాదంతో సాగు విధానాలను తమ పాఠ్యాంశాల్లో భాగంగా చేశామని ఆమె వివరించారు.

సిద్ధు పీఠాన్ని వీడాల్సిందే

● భాజపా నేత విజయేంద్ర జోస్యం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అక్రమాల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసి, విచారణను ఎదుర్కొనడం తప్పనిసరని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర జోస్యం చెప్పారు. సిద్ధరామయ్య ఎంత మొండిగా వ్యవహరించినా, పీఠాన్ని వీడవలసిందేనన్నారు. పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతిని పురస్కరించుకుని పార్టీ ప్రధాన కార్యాలయం 'జగన్నాథభవన్'లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తాను రాజీనామా ఎందుకు చేయాలని ముఖ్యమంత్రి ప్రశ్నించడం హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రికి తన భార్య, కుటుంబ సభ్యులు చేస్తున్న లావాదేవీల విషయం తెలియకుండా ఉంటుందా అని న్యాయస్థానం ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. తాము రాజకీయ కక్షసాధింపుగా పోరాటం చేయలేదని, న్యాయపోరాటం మాత్రమే చేస్తున్నామని చెప్పారు. మాజీ మంత్రి ఈశ్వరప్పను మళ్లీ భాజపాలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను పార్టీ హైకమాండ్ ఇప్పటికీ ప్రారంభించలేదన్నారు. ఈశ్వరప్పను యత్నాళ్, మరికొందరు కలసిన విషయం తనకు తెలియదన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఈశ్వరప్పతో తాను ప్రస్తుతం మాట్లాడడం లేదని స్పష్టం చేశారు.



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న విజయేంద్ర



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మహిళా మోర్చా ప్రతినిధులు

వైద్య పరీక్షలు..

వైద్య శిబిరంలో పార్టీ నాయకులు చలువాది నారాయణస్వామి, మురుగేశ్ నిరాణి, భారతిశెట్టి, రవికుమార్, ధనుంజయ సర్జి, శరణు తళ్లికేరి తదితరులు రక్తపోటు, దంత, నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. కిద్వాయి, మెట్రోపోలిస్‌తో పాటు వివిధ సంస్థల వైద్యులు, వైద్యేతర సిబ్బంది ఆరోగ్య పరీక్షలను చేశారు. దీనదయాళ్ ఉపాధ్యాయతో పాటు, ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి ప్రారంభించిన వివిధ సేవా కార్యక్రమాలను అక్టోబరు మొదటి వారం వరకు అన్ని జిల్లా, తాలూకా కేంద్రాలలో నిర్వహిస్తున్నామని విజయేంద్ర తెలిపారు.

అత్తింటి వేధింపులతో భర్త ఆత్మహత్య

కోలారు, న్యూస్‌టుడే : కట్నం కోసం వేధిస్తున్నానంటూ నాపైనే గృహ హింస చట్టం కింద కేసు పెట్టి, భార్య, అత్తింటి వారు వేధిస్తున్నారని శ్రీకాంత్ (31) అనే వ్యక్తి ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడు. కోలారు తాలూకా ముదవత్తి గ్రామానికి చెందిన ఆయన ఆత్మహత్యకు ముందుగా ఒక సెల్ఫీ వీడియో తీసుకుని, తన స్నేహితులు, బంధువులకు పంపించారు. మార్కండేయ కొండ వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. 'నా ఆత్మహత్యకు భార్య తరపు వారి సతాయింపులే కారణం' అని ప్రకటించి తనువు చాలించాడు. కోలారు గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బోనులో పడిన చిరుత

చామరాజనగర : గడగూరు గ్రామ ప్రజల కంటిమీద నాలుగు రోజులుగా కునుకే లేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు బోనులో పడిందని అధికారులు బుధవారం ప్రకటించారు. చిరుత సంచరిస్తుందని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో గుండ్లుపేట తాలూకా గడగూరు గ్రామం చుట్టుపక్కల అధికారులు బోనులను ఏర్పాటు చేశారు. ఒక బోనులో ఆరేళ్ల వయసు ఉన్న మగ చిరుత పడి ఉండడాన్ని గుర్తించారు.

అపూర్వం.. సర్కారు వైద్యం!

■ 'కార్పొరేట్'ను మరిపిస్తున్న 'చిటిగుప్పి'

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అంటే ప్రతి ఒక్కరూ నొసలు చిట్లిస్తారు. కష్టమైనా.. అప్పు చేసైనా ప్రైవేటు ఆసుపత్రిలోనే చికిత్సలకు ప్రాధాన్యమిచ్చే వారికి కొదవేలేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన మౌలిక సదుపాయాల కొరత, వైద్యులు అందుబాటులో ఉండరనే అపవాదు ఉంది. హుబ్బళ్లి పాలికె పరిధిలోని చిటగుప్పిలోని ప్రభుత్వ ఆసుపత్రిని చూస్తే దాన్ని ప్రైవేటు ఆసుపత్రి అనే భ్రమ కలుగుతుంది. ఇది ప్రారంభంలో 30 పడకల ఆసుపత్రి. వైద్యాధికారిగా డాక్టర్ శ్రీధర్ దండెప్పనవర్ బాధ్యతలు తీసుకున్న అనంతరం పాలికె సహకారంతో నూరు పడకల ఆసుపత్రిగా విస్తరించారు. ల్యాప్రోస్కోపీ, నియో న్యాటల్ ఐసీయూ, ఎంఆర్ స్కాన్ తదితర సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. వైద్య సిబ్బంది సహకారంతో క్లిష్టమైన వందలాది శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. గతంలో నెలకు 30 శస్త్రచికిత్సలే ఇక్కడ జరిగేవి. ప్రస్తుతం 150 కాన్పులు, 50 పెద్ద శస్త్రచికిత్సలు, 200 వరకు ఇతర శస్త్రచికిత్సలను నిర్వహించేందుకు సదుపాయాలు చేయగలుతున్నామని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. బీపీఎల్ కార్డు ఉన్న గర్భిణులకు ఉచితంగా కాన్పులు చేయించుకునేందుకు అవకాశం ఉండడంతో ఎక్కువ మంది వస్తున్నారని చెప్పారు. కొత్తగా డయాబెటిక్ చికిత్స విభాగాన్ని ప్రారంభించడంతో రక్తపోటు, రక్తంలో చక్కెర నిలువల పరీక్షలు చేయించుకునేందుకు వస్తున్న వారితో నిత్యం 600 మందికి ఓపీలో పరీక్ష చేస్తున్నామని ఆయన వివరించారు. బీపీఎల్ కార్డు ఉన్న ఇన్‌పేషెంట్ మహిళలకు అన్ని ఔషధాలూ ఉచితమే కాకుండా, భోజనం సమకూరుస్తున్నామని వివరించారు. త్వరలో రోగులకు తోడుగా ఉండేవారి కోసం వీఐపీ గదులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.



ఆసుపత్రి బయటి భాగం.. నవీకరణకు ప్రతిరూపం



వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ దండెప్పనవర్



ఆసుపత్రిలో చక్కగా తీర్చిదిద్దిన శస్త్రచికిత్సల విభాగం

ప్రతాప్‌సింహపై అభియోగం

యాదగిరి, న్యూస్‌టుడే : మత ఘర్షణలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన ఆరోపణలపై మైసూరు మాజీ ఎంపీ ప్రతాప్ సింహపై శహపుర ఠాణాలో కేసు నమోదైంది. ఈ నెల 21న హిందూ మహాగణపతి శోభా యాత్రలో ఆయన పాల్గొన్నారు. వినాయకుని విగ్రహాలపై రాళ్లు రువ్వే ప్రవృత్తి ఒక వర్గానికి చెందిన వారిలో ఎక్కువవుతోందని, హిందువులూ చేతిలో రాళ్లు పట్టుకుంటే ఏమవుతుందంటూ వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆయనకు నోటీసులు జారీ చేశారు.

లోకాయుక్త వలలో ప్రిన్సిపల్

చిక్కమగళూరు : కడూరు తాలూకా బీరూరు ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో హాజరు తక్కువ ఉన్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు లంచం తీసుకుంటున్న ప్రిన్సిపల్ ప్రవీణ్‌ను లోకాయుక్త అధికారులు అరెస్టు చేశారు. ప్రవీణ్‌తో కలిసి లంచం తీసుకున్న ఎఫ్‌డీఏ సదాశివయ్య లోకాయుక్త వలలో పడ్డాడు. ఎనిమిది మంది విద్యార్థుల నుంచి వీరు రూ.10 వేలు తీసుకున్నారు. మరో రూ.4 వేలు తీసుకుంటున్న సమయంలో దాడి చేశారు.

కీటకాలతో భలే రుచులు!

ధార్వాడ, న్యూస్‌టుడే : ధార్వాడ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న రైతుమేళాలో భాగంగా వివిధ రకాల కీటకాలతో చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. మిడతలు, బొద్దింకలు, నల్లని సైనిక తేనెటీగలు, పట్టుపురుగులను ఉపయోగించి చేసిన వేపుళ్లు, సూప్, బర్గర్, పన్నీర్ టిక్కా తదితర పది రకాల ఆహార పదార్థాలను మేళాకు వచ్చిన వారు ఆసక్తిగా గమనించారు. విశ్వవిద్యాలయ కీటక శాస్త్రం విభాగం ఆచార్యులు ఆయా కీటకాల జీవిత చక్రాన్ని సందర్శకులకు వివరించారు. వీటిని చూడగానే తినేందుకు ఎవరూ ఆసక్తి చూపించలేదని విద్యార్థులు తెలిపారు. చైనా, థాయిల్యాండ్, ఉత్తర కొరియాతో పాటు ఆఫ్రికా ఖండంలోని పలుదేశాల్లో ఈ కీటకాల వంటలను ఇష్టపడి తింటారు. వాటిలో 60 శాతం మాంసకృత్తులు ఉంటాయని ఆచార్యులు తెలిపారు. మనదేశంలోనూ అడవులకు సమీపంలో ఉంటున్న ఆదివాసీలు, గిరిజనులు ఉసిళ్లు, ఎర్రచీమలను కాల్చుకుని తింటారని కొందరు సందర్శకులు గుర్తు చేశారు.



ప్యూపల్.. పెనంపై వండివార్చాక..



కీటకాల స్టఫింగ్‌తో చేసిన బర్గర్



సికాడా వేపుడు ఆహారం

నదిలో దూకి బలవన్మరణం

కార్వార, న్యూస్‌టుడే : పారిశ్రామికవేత్త వినాయక్ నాయకను హత్య చేసి పరారైన ముగ్గురిలో ప్రధాన నిందితుడు గురుప్రసాద్ మాండవి నదిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతని మృతదేహాన్ని నది నుంచి బుధవారం వెలికి తీశారు. ఈ నెల 22న వినాయక నాయక, ఆయన భార్యపై నిందితులు మారణాయుధాలతో దాడి చేశారు. ఆ దాడిలో తీవ్రంగా గాయపడిన వినాయక నాయక మరణించిన విషయం విదితమే.



బెంగళూరులో పండ్లు కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్- కిలో..రూ.లలో)

- బీన్స్- 55
- క్యారెట్- 65
- బీరకాయలు- 40
- క్యాబేజి- 20
- కాలిఫ్లవర్ (ఒక్కోటి)- 25
- సొరకాయ- 40
- దొండకాయలు- 45
- పొట్లకాయ- 35
- టమాటా(నాటు)- 45
- టమాటా (సాధారణ) -40
- గుమ్మడి- 40
- ఆలుగడ్డ- 35
- ఉల్లిగడ్డలు (మేలురకం)- 65
- ఉల్లిగడ్డలు (సాధారణ) 50
- సాంబారు ఉల్లి- 95
- బీట్‌రూట్- 25
- వంకాయలు- 45
- బెండకాయలు- 40
- ముల్లంగి- 40
- నిమ్మకాయ- 200
- వాషింగ్టన్ ఆపిల్ : 305
- సిమ్లా ఆపిల్- 150
- గ్రీన్ ఆపిల్- 320
- అరటి కాయలు- 36
- సపోటా- 55
- పైనాపిల్- 38
- బొప్పాయి- 44
- ఆరంజి- 85
- బత్తాయి- 55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

యువతికి కత్తిపోట్లు

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : తన వెంటపడి వేధిస్తున్న మహేశ్ అనే యువకుడిని నీలా (19) అనే యువతి హుబ్బళ్లిలో బుద్ధిమాటలు చెప్పింది. ఇది సహించని యువకుడు ఆమెపై బుధవారం సాయంత్రం కత్తితో దాడి చేసి పరారయ్యాడు. గాయపడిన బాధితురాలిని చికిత్స కోసం కిమ్స్‌లో చేర్పించారు. పాత హుబ్బళ్లి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎంబీ కుమార్ తొలగింపు

మండ్య : శ్రీరంగపట్టణ తాలూకా కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు ఎంబీ కుమార్‌ను పదవి నుంచి తప్పిస్తూ కసాపా అధ్యక్షుడు మహేశ్ జోషి ఆదేశించారు. ఆయనపై హత్య కేసు ఆరోపణలున్నాయి.



ఏనుగులకు స్నానం చేయిస్తున్న మావటీలు,



నాయనమ్మ- రాజమాత ప్రమోదాదేవితో కలిసి ఏనుగులను చూస్తున్న యువరాజు

గజరాజులకు ఆరోగ్యరక్ష

మైసూరు, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో పాల్గొంటున్న ఏనుగులకు మావటీలు నిత్యం మజ్జన (స్నానం) చేయించి.. మైసూరు రాజమందిర ఆవరణలో వ్యాహ్యాళికి తీసుకువెళుతూ వాటి ఆరోగ్య రక్షణకు ప్రత్యేకంగా శ్రమిస్తున్నారు. ప్యాలెస్ నుంచి బన్నిమండపం వరకు అభిమన్యు, ఇతర ఏనుగుల తాలీము (సాధన) కొనసాగుతోంది. అభిమన్యుపై చెక్కతో చేసిన సింహాసనం ఉంచి, వెయ్యికిలోల తూకం ఉన్న ఇసుక మూటలతో నడిపిస్తున్నారు. ఫిరంగులు కాల్చుతూ.. ఏనుగులు భయపడకుండా తాలీములో కొనసాగేలా సాధన చేయిస్తున్నారు. ప్యాలెస్ లోపల రాజవంశస్థులు నిర్వహించే ప్రైవేటు దసరాకు కంజన్, భీమ ఏనుగులను రాజమాత ప్రమోదాదేవి ఒడెయరు ఎంపిక చేసుకున్నారు. ధనుజంయ అనే ఏనుగుతో ఇటీవల కుంజన్ గొడవ పడింది. దీంతో ప్యాలెస్‌లో నిర్వహించే దర్బారుకు దాన్ని ఎంపిక చేసుకున్నారు. ఈ ఏనుగులు పది రోజుల పాటు ధార్మిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటాయి. బంగారు సింహాసనంపై రాజవంశీకుడు కృష్ణదత్త ఒడెయరు కూర్చుని పాలన చేసే సమయంలో ఏనుగులు, గుర్రాలు, ఒంటెలతో కలిసి వచ్చే ముత్తయిదువలు పూర్ణ కుంభాలతో స్వాగతం పలుకుతారు. తన మనవడితో కలిసి ఏనుగులను పరిశీలించిన ప్రమోదాదేవి.. ఈ సారి వేడుకలకు కంజన్, భీమలను ఎంపిక చేసుకున్నారని అటవీశాఖ అధికారులు తెలిపారు. జంబూ సవారీకి తీసుకు వచ్చిన అన్ని ఏనుగులూ ఉల్లాసంగా ఉన్నాయని మావటీలు పేర్కొన్నారు.



అభిమన్యుపై కూర్చుని వస్తున్న మావటీ

సినిమా పండగ

మైసూరు, న్యూస్‌టుడే : దసరా మహోత్సవాలను పురస్కరించుకుని దసరా చలనచిత్రోత్సవాల పోస్టరును జిల్లా వ్యవహారాల బాధ్యుడు మహదేవప్ప విడుదల చేశారు. జిల్లా పంచాయతీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అక్టోబరు నాలుగో తేదీ నుంచి పది వరకు నిర్వహించే ఈ చిత్రోత్సవాల్లో 112 సినిమాలను ప్రదర్శిస్తామని చెప్పారు. హుణసూరు రోడ్డులో డీఆర్‌సీ థియేటర్, ఐనాక్స్‌లో మూడు థియేటర్లలో ఈ సినిమాలను ప్రదర్శిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ మంజేగౌడ, ముడా అధ్యక్షుడు కె.మరిగౌడ, అధికారులు లక్ష్మీకాంత్, కేఎం గాయత్రి, విష్ణువర్ధన్, టీకే హరీశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



డాక్టర్ మహదేవప్ప

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

తెలుగు తేజానికి డాక్టరేట్ ప్రదానం



ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న మంత్రి సుధాకర్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ప్రవాసాంధ్రుడు, స్వర్ణ గ్రూపు సీఎండీ డాక్టర్ సి.హెచ్.వి.ఎస్.వి.ప్రసాద్‌కు ధారవాడ కర్ణాటక విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం సందర్భంగా ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ సుధాకర్ తదితరులు ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రవాసాంధ్రుడైన ఆయన హుబ్బళ్లిలో పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. పేద విద్యార్థుల చదువుకు ఆయన ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది.

29న వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనం



బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ప్రణవపీఠ వ్యవస్థాపకులు, సహస్రావధాని, ప్రముఖ ప్రవచనకారుడు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ నిర్వహించే ఆధ్యాత్మిక ప్రవచనం తెలుగువారిని భక్తిసాగరంలోకి తీసుకెళ్లనుంది. ఈనెల 29న సాయంత్రం గిరినగర్‌లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం ఆంజనేయ దేవస్థానం ఆడిటోరియంలో జరిగే ప్రవచన కార్యక్రమంలో ఆయన కలియుగంలో దేవాలయాల వైశిష్ట్యత గురించి ప్రవచించనున్నారు. మరో ఆధ్యాత్మికవేత్త నండూరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని నిర్వాహకుడు సుబ్రమణ్యం తెలిపారు. 30న హోమం, పద్మాకర్‌కు సన్మానం, ఆశీర్వాద కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు అసంఖ్యాకంగా విచ్చేసి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

హోసూరు కబుర్లు

రహదారి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్, తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు నియోజకవర్గంలో వివిధ పథకాల ద్వారా రహదారుల నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. రూ.7 కోట్లతో తారురోడ్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బేరికె రహదారి నుంచి ఆలూరు మల్లసంద్రం, గణగండపల్లి వరకు రూ.3.75 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే వై.ప్రకాష్ భూమిపూజ చేశారు. ముఖ్యమంత్రి రహదారి అభివృద్ధి పథకం కింద హోసూరు-ముత్తాళి రహదారి నుంచి తట్టగానపల్లి వరకు రూ.48 లక్షలు, ముత్తాళి గ్రామం నుంచి శూలగిరి సరిహద్దు వరకు మోర్నపల్లి, కెలవరపల్లి ద్వారా రూ.73 లక్షలు, తళి రోడ్డు నుంచి ఆనేకల్ కర్ణాటక సరిహద్దు వరకు రూ.2.11 కోట్లు రోడ్ల అభివృద్ధికి వ్యయం చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గజేంద్రమూర్తి, రమేష్, త్యాగరాజన్, హరీష్, లోకేష్ రెడ్డి, రాజేంద్రన్, బత్తలపల్లి దేవరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెత్త సేకరణకు బ్యాటరీ వాహనాలు



వాహనాలను అప్పగిస్తున్న కంట్రాక్టర్

హోసూరు: హోసూరు వీధుల్లో ఇంటింటా చెత్త సేకరణకు బ్యాటరీ వాహనాలను సమకూర్చారు. 15వ ఫైనాన్స్ కమిటీ ద్వారా 61 వాహనాలను కొనుగోలు చేయడానికి నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా బుధవారం 19 వాహనాలను కార్పొరేషన్ అధికారులకు కాంట్రాక్టర్ అప్పగించారు. ఈ వాహనాలను మేయర్ ఎస్.ఎ.సత్య జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ హెచ్.ఎస్.శ్రీకాంత్, ఉప మేయర్ సి.ఆనందయ్య, ఆరోగ్య విభాగం ఛైర్మన్ ఎన్.ఎస్.మాదేశ్వరన్, కార్పొరేటర్లు వెంకటేష్, మారక్క, పెరుమాయి, అరుళ్, మల్లికదేవి, ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కార్మికుల దుర్మరణం




ప్రమాదానికి గురైన మినీ లారీ

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-హొగెనక్కల్ రహదారి అంచెట్టి గ్రామానికి సమీపంలో మలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కార్మికులు దుర్మరణం చెందారు. సిమెంటు ఇటుకలతో వెళుతున్న మినీలారీ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. మినీలారీలో ఇటుకల మీద కూర్చొని వెళుతున్న అదే ప్రాంతానికి చెందిన కార్మికురాలు జయలక్ష్మి, మదేష్, ఉత్తర భారతానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తి ప్రమాద స్థలంలో మృతి చెందారు. ద్విచక్ర వాహనం తునాతునకలైంది. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న వ్యక్తి ఆచూకీ తెలియలేదు. అంచెట్టి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను డెంకణికోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఇటుకలు మధ్య మహిళ మృతదేహం, మృతి చెందిన కార్మికులు

ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.3 లక్షల విరాళం



చంద్రబాబునాయుడుకు చెక్కు అందజేస్తున్న బొందు అల్లూరి సీతారామరాజు, పోతుల బాలకోటయ్య

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : విజయవాడ వరద ముంపు బాధితుల సహాయార్థం కర్ణాటక తెలుగు ప్రజాసమితి అధ్యక్షుడు డాక్టర్ బొందురామస్వామి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.3లక్షల విరాళం అందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును బొందు అల్లూరి సీతారామరాజు, అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య కలిసి విరాళం చెక్కును అందజేశారు. ఈసందర్భంగా బొందు అల్లూరి సీతారామరాజు మాట్లాడుతూ బొందురామస్వామి రూ.లక్ష, కుమారులు బొందుభగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, బొందు సమసమాజం, కుమార్తె శ్రీశ్రీలు రూ.50 వేలు చొప్పున కలిసి అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసనగా బెంగళూరు నగరంలో కర్ణాటక తెలుగు ప్రజాసమితి సభ్యులు చేసిన నిరసన ప్రదర్శనలు ఆయన దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. బెంగళూరు నగరంలో సమితి చేస్తున్న కార్యక్రమాలను అలకించిన ముఖ్యమంత్రి మెచ్చుకుని, బొందురామస్వామి కుటుంబ సభ్యులను అభినందించారని పోతుల బాలకోటయ్య తెలిపారు. ముంపు బాధితులకు సహాయ సహకారాలు అందించేందుకు ప్రవాసాంధ్రులు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.

పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం



పౌష్టికాహారం అందజేస్తున్న సోమశేఖర్ తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : యశ్వంతపుర విధాన సభా క్షేత్రం కుంబళగూడు గ్రామపంచాయతీలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీని ఎమ్మెల్యే ఎస్.టి. సోమశేఖర్ ప్రారంభించారు. బుధవారం ప్రభుత్వం అక్షరదాసోహ-మధ్యాహ్నం ఉపహార పథకంలో పాఠశాల విద్యార్థులకు పౌష్టికాంశాలతో కూడిన ఆహార పదార్థాలను అందించారు. పాఠశాల బాలలకు వారంలో ఆరు రోజుల పాటు గుడ్డు, అరటిపండు, చిక్కి-వేరుశెనగకాయలతో చేసిన తీపిని అందించామని తెలిపారు. విద్యాశాఖ అధికారులు, గ్రామపంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలికె నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

బెంగళూరు (సదాశివనగర) : మల్లేశ్వరం పాలికె మైదానంలో గేటు మీద పడి మృతి చెందిన బాలుని కుటుంబ సభ్యులను ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు బుధవారం పరామర్శించారు. ఒకే చోట గేటును మూడు సార్లు ఏర్పాటు చేసేందుకు పాలికె రూ.1.50 కోట్లను ఖర్చు చేసిందని ఆరోపించారు. గేటు, ప్రహరీ నిర్మాణాల్లో పలు అక్రమాలు జరిగాయన్నారు. బెంగళూరు నగర జనాభా 1.5 కోట్లు దాటినా, వారికి మెరుగైన సదుపాయాలను కల్పించడంలో పాలికె, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. గేటు, ప్రహరీ నిర్మాణానికి సంబంధించి దర్యాప్తునకు ఆదేశించకపోతే పోరాటాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

మోటారు, టాంగా సవారీ పోటీలకు పేర్ల నమోదు

బెంగళూరు (క్రీడలు) : మైసూరు దసరా ఉత్సవాల్లో జావా మోటారు బైక్ సవారీ పోటీలను అక్టోబరు 4 నుంచీ 6 వరకు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. 25-50 ఏళ్ల వారికి జరిగే పోటీల్లో విద్యార్థులు, యువకులు, పురుషులు పాల్గొవవచ్చు. ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. పది మందికి మాత్రమే అవకాశం. టాంగాసవారీ పోటీలను అక్టోబరు 5న ఏర్పాటు చేస్తారు. యాభై జంటలు పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. నడక కార్యక్రమం అక్టోబరు ఆరున నిర్వహిస్తారు. 18-50 ఏళ్ల వారు పాల్గొనవచ్చు. రెండు వందల మంది ఇందులో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. ఆసక్తిగల వారు ఈ నెలాఖరులోగా దొడ్డకెరె మైదానంలోని కర్ణాటక దసరా ప్రదర్శన ప్రాధికార ఆవరణంలోని పురాతత్వ సంగ్రాహాలయం ఉప డైరెక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మైసూరు సంస్థానాన్ని గౌరవించాలి



ధర్మేంద్రకుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న వివేక్‌ఆళ్వా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : చారిత్రక గుర్తింపు పొందిన మైసూరు సంస్థానాన్ని గౌరవించాలని చరిత్రకారుడు ధర్మేంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఆళ్వాస్ కళాశాల కువెంపు సభాప్రాంగణంలో వాగ్గేయకారుల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కర్ణాటక ఇతిహాస కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యాసం చేశారు. నాల్వడి కృష్ణరాజ ఒడెయార్ విద్యకు ఇచ్చిన ప్రాధాన్యం, దివ్యాంగులకు లిపి తెచ్చిన ఘనత కన్నడిగులకు చెందుతుందని తెలిపారు. మహారాజుల పాలనలో తొలి మైసూరు విశ్వవిద్యాలయం ప్రారంభం కావడం కర్ణాటకకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ప్రతిష్టాన వ్యవస్థాపక ట్రస్టీ వివేక్‌ఆళ్వా, ప్రిన్సిపల్ కురియన్, పాలనాధికారి బాలకృష్ణశెట్టి, విద్యార్థులు పాల్గొన్నారు.

27న కొత్త రైలు ప్రారంభం

తుమకూరు : తుమకూరు-యశ్వంతపూర్ రైలును ఈ నెల 27న కేంద్ర మంత్రి సోమణ్ణ ప్రారంభిస్తారని నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్ తెలిపారు. ఇక్కడి పత్రికా భవనంలో భాజపా, జేడీఎస్ నాయకులు సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లో సమస్యను పరిష్కరించారన్నారు. కొత్త రైలు ఆదివారం మినహా అన్ని రోజుల్లో సంచరిస్తుందన్నారు. సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ హెబ్బాక, జేడీఎస్ నాయకుడు నాగరాజు, మాజీ జడ్పీ అధ్యక్షుడు హుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతిగణేష్, రవిశంకర్ తదితరులు

మొక్కల సంరక్షణపై సదస్సు



పుస్తకాన్ని విడుదల చేస్తున్న మునియప్పన్, కృష్ణకుమార్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర): వర్షపాతం తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉద్యానవనాల పంటల అభివృద్ధి, ఎక్కువ దిగుబడి సాధించే విధంగా పరిశోధనలు సాగించాలని ఐపీఎం ఇన్నోవేషన్ ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మునియప్పన్ తెలిపారు. బుధవారం ఇక్కడ హెసరుఘట్ట భారతీయ ఉద్యానవనాల పరిశోధన సంస్థ ఆవరణలో మొక్కల సంరక్షణ అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు తక్కువగా కురిసే ప్రాంతాల్లో ఉద్యానవనాల పంటలు అభివృద్ధి చేయాలన్నారు. ఆ దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగించాలని సూచించారు. ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎన్. సుశీల మాట్లాడుతూ ఉద్యానవనాలను పట్టి పీడిస్తున్న కీటకాల నియంత్రణపై నిఘా వేయాలని తెలిపారు. ఉద్యానవనాల పంటల ఉత్పత్తి 350 మిలియన్ టన్నుల పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా ఉద్యానవనాలు-కీటకాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్జీనియా టెక్ విశ్వవిద్యాలయం అధ్యాపకుడు డాక్టర్ ఎన్.ఎ.కృష్ణకుమార్, తిరుచ్చి ఐకార్ డైరెక్టర్ డాక్టర్ సెల్వరాజన్, హెసరుఘట్ట ఐకార్-ఐఐహెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర టి.కె.బెహెరా తదితరులు పాల్గొన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ సీతానంతం పురస్కారాన్ని ఎన్.బి.వి.చలపతిరావు, కోల్లా జయమ్మ పురస్కారాన్ని చాందీశ్ బిల్లాళ్‌లకు అందజేశారు.

నగరంలో ఈనాడు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :

- ఉదయం 9 గంటలకు రేస్‌కోర్స్ రోడ్డులోని హలీడే ఇన్ బెంగళూరులో బెంగళూరు వాణిజ్య పరిశ్రమల సమాఖ్య (బీసీఐసీ) లీడర్‌షిప్ మిట్-2024 సమావేశం జరుగుతుంది. పారిశ్రామికవేత్తలు పీటర్ బాయన్, మీనా గణేశ్, డాక్టర్ సంజీవ్‌కుమార్ గుప్తా, సునీల్ కిశోర్ తదితరులు హాజరవుతారు.
- ఉదయం 10.30 గంటలకు రాజప్రస్థానం మైదానంలో లఘు ఉద్యోగి భారతి ఏర్పాటు చేసే సుఫాస్ ఎక్స్‌పో-2024 ప్రదర్శనను కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె ప్రారంభిస్తారు.
- ఉదయం 10.30 గంటలకు హెసరుఘట్ట భారతీయ ఉద్యానవనాల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు సంరక్షణపై సెమినార్ ప్రారంభం. ఐకార్-ఐఐహెచ్‌ఆర్ డాక్టర్ టి.కె. బెహరా తదితరులు పాల్గొంటారు.

బాధితుడి కుటుంబానికి పరిహారం



పరిహారం అందిస్తున్న డీకే శివకుమార్, దినేశ్‌గుండూరావు తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మల్లేశ్వరం పాలికె మైదానం గేట్ మీద పడి మృతి చెందిన బాలుడు నిరంజన్ (11) కుటుంబ సభ్యులను బుధవారం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పరామర్శించారు. బాలుడి చిత్రపటానికి పువ్వులు వేసి నివాళులు అర్పించారు. పరిహారం కింద రూ.10లక్షల చెక్కును బాలుడి తల్లిదండ్రులకు ఆయన అందజేశారు. ఇలాంటి సంఘటనలు జరగకూడదని, బాలుడి నేత్రాలను దానం చేసి సమాజానికి కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. నిరంజన్ చెల్లెలు చదువు ఖర్చును భరించేందుకు గుండూరావు ఫౌండేషన్ ముందుకు వచ్చిందన్నారు. మంత్రి దినేశ్ గుండూరావు, చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి



విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న ప్రముఖులు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసుకునేలోగా వృత్తి నైపుణ్యాలు, కౌశల్యాలను పెంపొందించుకోవాలని విద్యావేత్త గోపాలరావు సూచించారు. చదువుకునే సమయంలోనే కొత్త ప్రాజెక్టులు, మార్పులకు అనుగుణంగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. చిక్కబళ్లాపుర శివార్లలోని నాగార్జున ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యాభ్యాసం చేసే సమయంలో సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. విద్యాభ్యాసంతో పాటు, ఆసక్తి ఉన్న మరో విద్యను కూడా నేర్చుకోవాలని కార్గిల్ యుద్ధ వీరుడు కెప్టెన్ నవీన్ నాగప్ప కోరారు. దేశం నాకు ఏమిచ్చిందని కాకుండా, దేశానికి నేను ఏమి సేవలు అందించగలనని ఆలోచించాలన్నారు. ప్రతిభ కనబరచిన ఇంజినీరింగ్ విద్యార్థులు వర్ష పట్టణశెట్టి, నమ్రత, చిన్మయి, అనన్య, ప్రియాంక, యశస్వినిలకు బెంగళూరు ఎన్ఈఎస్ డైరెక్టర్ ఎస్‌జీ గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ బీవీ రవిశంకర్‌లు పురస్కారాలను ప్రదానం చేశారు.

'న్యాయస్థానం తీర్పు అమలు చేయాలి'



సమావేశానికి హాజరైన దండోరా నేతలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : సర్వోన్నత న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీ వర్గాల రిజర్వేషన్లను వర్గీకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని తీర్పు వచ్చి రెండు నెలలు గడిచినా నేటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడాన్ని మాదిగ దండోరా జనజాగృతి సమితి తీవ్రంగా ఖండించింది. బుధవారం ఇక్కడ శాసనసభ్యుల నివాస గృహంలోని సమావేశమందిరంలో సమితి అధ్యక్షుడు ఎంసీ శ్రీనివాస్ అధ్యక్షతన సమితి పదాధికారుల సమావేశం జరిగింది. ఎస్సీ, ఎస్టీ వర్గాల రిజర్వేషన్‌ను వర్గీకరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 1న బృహత్ బెంగళూరు మహానగర పాలికె పారిశుద్ధ్య కార్మికులు పనులు బంద్ చేసి నిరసన వ్యక్తం చేయాలని తీర్మానించినట్లు శ్రీనివాస్ తెలిపారు. వర్గీకరణపై సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వాగతం పలికి అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జనసంఖ్య ఆధారంగా రిజర్వేషన్లను వర్గీకరించాలని కోరారు. వర్గీకరణకు సంబంధించి జస్టిస్ సదాశివ కమిషన్ నివేదిక అమలు చేయాలని ఒత్తిడి తెచ్చారు. సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రామప్ప, దాస్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఏణమ్మ, ఉపాధ్యక్షురాలు దానమ్మ, నగర విభాగం అధ్యక్షురాలు నారాయణమ్మ, భీమజ్యోతి శ్రీనివాస్, డాక్టర్ బాబు, పీఎం వెంకటేశ్, కేబీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బి.కె.హళ్లి పంచాయతీ అధ్యక్షురాలిగా సరోజభాయి



అధ్యక్షురాలు సరోజభాయిని సత్కరిస్తున్న సభ్యులు

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని బి.కె.హళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్ష పదవికి బుధవారం ఎన్నికలు జరిగాయి. 11 మంది సభ్యులున్న ఈ పంచాయతీలో గతంలో అధ్యక్షురాలుగా ఉన్న అలివేలమ్మ తన పదవి కాలం ముగియడంతో రాజీనామా చేశారు. దీంతో ఎన్నికలు నిర్వహించారు. 11 మంది కాంగ్రెస్ సభ్యులు కె.సేవాలాల్‌పుర తాండా గ్రామానికి చెందిన సరోజాభాయికి మద్దతు తెలిపారు. సరోజాభాయి అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వరదరాజు ప్రకటించారు. నూతన అధ్యక్షురాలును ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్, మాజీ గ్రామ పంచాయతీ అధ్యక్షులు రామలింగప్ప, సుబ్బరాయప్ప, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

కెంగేరి వద్ద రాంబో సర్కస్ ప్రారంభం



కత్తులతో ఒళ్లు గగుర్పొడిచే ప్రదర్శనలో కళాకారులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : కరోనా మహమ్మారి సమయంలో ప్రదర్శనలు నిలిచి పోవడంతో సర్కస్ కళాకారులు ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్నారని రాంబో సర్కస్ యజమాని సుజిత్ దిలీప్ తెలిపారు. ఆ సమయంలో ప్రేక్షకులను చేరుకునేందుకు ఆన్‌లైన్‌లోనూ ప్రదర్శనలు ఇచ్చినా, అవి ఆశించిన స్థాయిలో ఫలితాన్ని ఇవ్వలేదని చెప్పారు. పరిస్థితులు చక్కబడడంతో కెంగేరి బస్టాండ్ సమీపంలోని మెట్రోస్టేషన్ వద్ద మైదానంలో ప్రారంభించిన సర్కస్‌కు చక్కని స్పందన వస్తుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4 గంటలకు, రాత్రి ఏడు గంటలకు ప్రదర్శన ఉంటుందన్నారు. అక్టోబరు నెలాఖరు వరకు నిర్వహిస్తామన్నారు. దేశీయ, విదేశీ కళాకారులతో స్కేటింగ్, ల్యాడర్ బ్యాలెన్స్, క్యూబ్ జగ్లింగ్, రోలా బొల్లా, హులా హోప్, ఏరియల్ రోప్ తదితర ప్రదర్శనలకు చక్కని స్పందన లభిస్తుందని వివరించారు. ప్రదర్శనలు మానేసిన సీనియర్ కళాకారులు కూడా తమతోనే ఉంటున్నారని ఆయన తెలిపారు.

లారీ, కారు ఢీ : బెంగళూరు వాసులకు గాయాలు

గోరంట్ల, న్యూస్‌టుడే : గోరంట్ల మండల పరిధిలోని పుల్లగూర్లపల్లి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కంటైనర్ లారీని వెనక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులు బెంగళూరులోని కేఆర్ పురానికి చెందిన వారు. గుంతకల్లులోని బంధువుల ఇంట్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తొమ్మిది మంది ఒకే వాహనంలో తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వెంకటరమణ, నాగరాజు, మరో చిన్నారిని చికిత్స నిమిత్తం బాగేపల్లికి తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ వీవీనాయక్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

సుబ్రహ్మణ్య ఆలయాన్ని సందర్శించిన కమిషనర్



ఆలయ పత్రాలను పరిశీలిస్తున్న కమీషనర్ వెంకటేశ్

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని నాగలమడక గ్రామంలో సుప్రసిద్ధ అంత్య సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాన్ని బుధవారం రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎం.బి.వెంకటేశ్ సందర్శించారు. తాలూకాలోని అధికారులతో కలిసి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ జీర్ణోద్ధారణకు ఎనిమిదేళ్ల నుంచి స్థానికులు డిమాండ్ చేస్తున్నారని, గతంలో రాష్ట్ర స్థాయి వాస్తు శిల్ప సమితి ఆలయ జీర్ణోద్ధరణ గురించి చర్చించారని ఆయన తెలిపారు. ఆలయ పరిశీలన చేసి మంచి చెడులను బేరీజు వేస్తామన్నారు. కమిషనర్, మాజీ మంత్రి వెంకటరమణప్పకు, వాస్తు శిల్ప సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి, ఆగమ శాస్త్ర పండితుడు విజయ్‌కుమార్‌లకు ఆలయ పూజారులు, సిబ్బంది పూర్ణకుంభ మేళాతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరదరాజు, పీడబ్ల్యూడీ అధికారి అనిల్‌కుమార్, దేవాలయ జీర్ణోద్ధరణకు పోరాటం చేస్తున్న వి.నాగభూషణరెడ్డి, కోర్టు నరసప్ప పాల్గొన్నారు.

డీకేను కలిసిన క్రైస్తవ ప్రతినిధులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను బుధవారం ఇక్కడ సదాశివనగరలో ఆయన నివాసంలో బళ్లారి ఆర్చి బిషప్ హెన్రి డిసౌజా నేతృత్వంలో క్రైస్తవ ప్రతినిధులు కలిశారు. బళ్లారి క్రైస్తవ ధర్మక్షేత్రం అమృత మహోత్సవాలకు హాజరు కావాలని ఆయనను ఆహ్వానించారు.



శివకుమార్‌తో బళ్లారి ఆర్చి బిషప్ ప్రతినిధులు



నాగేంద్రకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ప్రముఖులు

డాక్టరేట్ అందుకున్న నాగేంద్ర

చిక్కబళ్లాపుర : కరాటేలో సాధించిన విజయాలకు మాస్టర్ నాగేంద్రకు ఆసియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. కోచ్ ఏపీ శ్రీనాథ్, వృత్తిలో రాణించేందుకు రాఘవేంద్ర సహకారంతోనే తాను కరాటేలో రాణించానని నాగేంద్ర తెలిపారు. డాక్టరేట్‌ను తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నానని తెలిపారు.

సిద్ధూ రాజీనామా చేయాలని భాజపా ఆందోళన

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : మైసూరు నగరాభివృద్ధి సంస్థ (మూడా) వ్యవహారంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేసి విచారణను ఎదుర్కోవాలని ఎమ్మెల్సీ కేఎస్ నవీన్ డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడ ఒనకే ఓబవ్వ కూడలిలో సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భాజపా కార్యకర్తలు చేపట్టిన నిరసన ప్రదర్శనలకు నేతృత్వం వహించి మాట్లాడారు. సిద్ధరామయ్య తన నిజాయతీని కోర్టు ద్వారా మాత్రమే నిరూపించుకోవాలన్నారు. నిరసన ప్రదర్శనలో ఎంపీ గోవింద కారజోళ, జిల్లా అధ్యక్షుడు మురళి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌కె బసవరాజన్, మాజీ జడ్పీ అధ్యక్షురాలు సౌభాగ్య, భాజపా నగర మండల అధ్యక్షుడు నవీన్ చాళుక్య, గ్రామీణ మండల అధ్యక్షుడు కల్లేశయ్య, సిద్ధార్థ గుండార్పి తదితరులు పాల్గొన్నారు.

సన్‌ఫీస్ట్ ఆహారశాల ప్రారంభం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఇక్కడి వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో ఐటీసీ సన్‌ఫీస్ట్ బేకరి కేఫ్‌ను బుధవారం ఇక్కడ ప్రముఖ క్రికెటర్ శ్రేయాంకా పాటిల్ ప్రారంభించారు. ఫ్యాబ్ ఇండియా ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌లో సన్‌ఫీస్ట్ బేకరి కేఫ్‌ను ప్రారంభించినట్లు సంస్థ నిర్వాహకుడు రోహిత్‌భల్లా తెలిపారు. నాణ్యమైన బేకరి ఆహార పదార్థాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఎంజీరోడ్డు, జయనగరల్లో తమ శాఖలను ప్రారంభిస్తామన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మునిరాజు, తదితరులు

రహదారి నిర్మాణానికి భూమిపూజ

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : దాసరహళ్లి నియోజకవర్గంలోని ప్రతివార్డులోనూ సిమెంటు రహదారి ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఎస్.మునిరాజు తెలిపారు. బుధవారం ఇక్కడ శెట్టిహళ్లి వార్డు అబ్బిగిరిలోని అయ్యణ్ణ కాలనీల్లో సిమెంటు రహదారి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అధికారులు, గుత్తేదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. వార్డు అధ్యక్షుడు సమస్యలను గుర్తించి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దాసరహళ్లి భాజపా అధ్యక్షుడు సోమశేఖర్, వార్డు అధ్యక్షుడు బి.సురేష్, ప్రధాన కార్యదర్శి శబరి మంజునాథ్, ఎస్.సుబ్బారెడ్డి, భాస్కర్, కళానగర్ టి.సుధాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

'సిద్ధూ రాజీనామా కోరడం అర్ధ రహితం'

రాయచూరు, న్యూస్‌టుడే : ముడా స్థలాల కేటాయింపు ఆరోపణలపై దర్యాప్తు ముగిసే వరకు సిద్ధరామయ్య సీఎం స్థానానికి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నాగవేణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలన్న అర్జీని న్యాయస్థానం తిరస్కరించిన విషయాన్ని ప్రతిపక్షాలు లోతుగా పరిశీలించాలని హితవు పలికారు. రాజీనామా డిమాండ్ చేయడం అర్ధరహితమని వ్యాఖ్యానించారు. కేంద్ర భాజపా పెద్దలు గవర్నర్ ద్వారా ప్రభుత్వాన్ని అస్థిర పరచాలన్న కుట్ర పన్నిందని ఆరోపించారు. విధానసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యత వచ్చినందున ప్రజలు సిద్ధరామయ్య వైపు ఉన్నారన్నారు. చివరకు న్యాయం గెలుస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు గ్రామీణ పరిధిలోని ఫీడర్ల వద్ద అత్యవసర పనుల నిమిత్తం ఈ నెల 26న కొన్ని గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు శక్తినగర్ జెస్కాం విభాగం అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. గార్లదిన్ని, దిన్ని, మర్చటాల్, వెంకటేశ్వర క్యాంపు, కుక్కల క్యాంపు, నెలహాళ్, మమదాపూరు, రాజా అమరేశ్వర నాయక్ క్యాంపు, పూర్తిప్లిలో సరఫరా జరగదు. నాగలాపూరు, ఉడమగల్ ఖానాపూరు, జాలిబెంచి, హళ్లిబెంచి, ఆశాపూరు, హీరాపూరు, గట్టు బిచ్చాలి, హనుమాపూరు, కటకనూరు, మటమారి చుట్టు పక్కల గ్రామాల్లో విద్యుత్తును నిలిపివేస్తున్నట్లు వివరించారు. ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

రైల్వే పనులు వేగవంతం చేయాలని వినతి

హుబ్బళ్లి, (మాన్వి) : గిణిగెరా-రాయచూరు, గదగ-వాడీ రైల్వే నిర్మాణం పనులను వేగవంతం చేయాలని హుబ్బళ్లి రైల్వే గుత్తేదారుల సంఘం విజ్ఞప్తి చేసింది. కేంద్ర రైల్వే సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక మొదటిసారి హుబ్బళ్లికి వచ్చిన సోమణ్ణను ఐఆర్‌పీపీఏ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రసాద్ అందించిన సేవలు అభినందనీయమన్నారు. స్వర్ణగ్రూప్ ఆధ్వర్యంలో బెళగావి రైల్వేస్టేషన్, ఉనకల్ రోడ్ అండర్ బ్రిడ్జ్, కృష్ణమందిర్ అండర్ బ్రిడ్జిలను రికార్డు వ్యవధిలో పూర్తిచేశారని కొనియాడారు. నిర్మాణ దశలో పనులను, కొత్తగా చేపట్టిన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కర్ణాటక విశ్వవిద్యాలయం ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేయడం సముచితమన్నారు. మంత్రి సోమణ్ణ ప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రైల్వే గుత్తేదారుల సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్యే కె.రమణమూర్తి, ప్రముఖులు అరవింద్ బెల్లద్, మహేష్, ప్రసాద్, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, శంకరరావు పాల్గొన్నారు.



మంత్రి సోమణ్ణ, ప్రసాద్‌లను సత్కరిస్తున్న ప్రముఖులు

నూతన సాంకేతికతతో అధిక దిగుబడులు



సమావేశంలో ప్రసంగిస్తున్న శరణగౌడ

రాయచూరు, న్యూస్‌టుడే : వ్యవసాయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆవిష్కరణలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్సీ, వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం వ్యవస్థాపక మండలి సభ్యుడు శరణగౌడ బయ్యాపూర అన్నదాతలకు సూచించారు. విశ్వవిద్యాలయం విత్తన విభాగం ఆవరణలో బుధవారం రబీ విత్తన దినోత్సవాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా శరణగౌడ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు పొలాల వద్దకు వెళ్లి సాంకేతికతను పరిచయం చేయాలని, రైతుల అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. తెగుళ్ల బాధ, దిగుబడుల పతనంపై అధ్యయనం చేయాలని సలహా ఇచ్చారు. ఖరీఫ్, రబీ సీజన్ సమయాల్లో ఏ సాగు చేయాలో, విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు ఎంత మోతాదులో వేయాలో సూచనలు ఇవ్వాలని కోరారు. సేద్యం గిట్టుబాటు కాకున్నా సరే వృత్తిని వీడవద్దని హితవు పలికారు. నష్టాలను అధిగమించేందుకు వ్యవసాయ అనుబంధ పరిశ్రమల వైపు మొగ్గు చూపాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే, మండలి సభ్యుడు బసవనగౌడ బ్యాగవ్యాట్ మాట్లాడుతూ పంటల మార్పిడి పద్ధతిని పాటించాలన్నారు. విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ నూతన వంగడాల గురించి ఎప్పటికప్పుడు తెలియజేయాలని, సకాలంలో విత్తనాలు, ఎరువులను అందించాలని కోరారు. నకిలీ విత్తనాలు కొని మోసపోకుండా మాధ్యమాల ద్వారా కర్షకులను చైతన్యం చేయాలన్నారు. భారతీయ విత్తన విజ్ఞాన విభాగం డైరెక్టర్ డాక్టర్ సంజయకుమార్ మాట్లాడుతూ రాయచూరు విశ్వవిద్యాలయం విత్తనాల తయారీలో తనదైన గుర్తింపు పొందిందని ప్రశంసించారు. విత్తనాల కొరతను తీర్చేందుకు రెండు గ్రామాల్లో వంగడాల తయారీ ప్రయోగం చేయాలని సూచించారు. ఇందులో యువ రైతులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఉప కులపతి డాక్టర్ హనుమంతప్ప మాట్లాడుతూ విత్తనాలు తయారు చేస్తే ప్రభుత్వం ప్రోత్సాహ ధనం చెల్లిస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వీరనగౌడ, విత్తన విభాగం అధికారి అరుణ్‌కుమార్, విస్తరణ నిర్దేశకుడు దేశాయి, వ్యవసాయ శాఖ జిల్లా నిర్దేశకుడు జయప్రకాష్, ధారవాడ విశ్వవిద్యాలయం ప్రత్యేక అధికారి రవి హుణజి, మండలి సభ్యులు మల్లికార్జున, మల్లేష్ కొలిమి, మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.



హాజరైన రైతులు, వ్యాపారులు

చంపా జీవితంపై రేపు సదస్సు



పాత్రికేయులకు వివరిస్తున్న శరణబసవ

రాయచూరు, న్యూస్‌టుడే : దివంగత ఆచార్య చంద్రశేఖర్ పాటిల్ (చంపా) జీవితం-రచనలపై చర్చించేందుకు ఈ నెల 27న రాయచూరులోని ప్రైవేటు కళాశాలలో సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు సిండికేట్ మాజీ సభ్యుడు డాక్టర్ శరణబసవ పాటిల్ వెల్లడించారు. ఆయన బుధవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. శరణ బసవేశ్వర విద్యా సంస్థ, పూరితిప్లి చాగల్ పార్వతమ్మ బసవణ్ణ డిగ్రీ కళాశాల, హొసమని ప్రకాశన సమితి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని వివరించారు. కన్నడ పర, సామాజిక పోరాటాలపై ప్రముఖంగా చర్చిస్తారని తెలిపారు. ఆయన జీవన పోరాటాలపై యువతకు స్ఫూర్తి కల్గించేందుకే సదస్సు జరుపుతున్నట్లు చెప్పారు. ఎయిమ్స్ సాధనా పోరాట సమితి సంచాలకుడు బసవరాజ కళస సదస్సును ప్రారంభిస్తారని, అధ్యాపకులు వీరేశ్ హులి, ఖాదర్ బాషా ప్రసంగిస్తారని, బసవరాజ్, రంగనాథరెడ్డి మన్సలాపూరు, బసవరాజ్ ఎలిని ముఖ్య అతిథులుగా ఆహ్వానించినట్లు విశదీకరించారు. కన్నడ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నిర్వాహకులు బషీర్ అహ్మద్ హొసమని, రామణ్ణ, సిద్ధరామయ్యప్ప, బసవరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుడ్లు, పండ్లు పంపిణీ

మాన్వి, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా వారంలో నాలుగు రోజులు గుడ్లు తినలేని వారికి అరటి పండ్లు ఇస్తున్నట్లు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ తెలిపారు. బుధవారం నుంచి మాన్విలో ప్రారంభించినట్లు చెప్పారు. 240 మంది విద్యార్థులకు గుడ్లు, 270 మంది విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, చన్నబసవరాజ్, శేఖ్‌హుసేన్ రేఖాదేవి, విద్యావతి, రజిని, అన్వర్, నిర్వాహకులు పాల్గొన్నారు.



గుడ్లు, అరటిపండ్లు చూపుతున్న విద్యార్థులు

పోటీ పరీక్షల్లో సంస్కరణలు

యూపీఎస్సీ తరహాలో కేపీఎస్సీ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలోనే కేపీఎస్సీ పరీక్షలు నిర్వహించేందుకు సంస్కరణ చర్యలు తీసుకురావాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులు, మంత్రులకు సూచించారు. కేపీఎస్సీ ద్వారా చేపడుతున్న నియామకాల ప్రగతిపై అధికారులు, మంత్రులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ కర్ణాటక విభాగంలో 371 జె-అధికరణకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఎదురయ్యే అడ్డంకులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నియామకాలను వేగంగా పూర్తి చేయడం, సిబ్బంది కొరతను పరిష్కరించుకునేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రివర్గం ఉపసమితి ఇచ్చే సిఫార్సులు, సూచనలను జాప్యం లేకుండా పూర్తిగా అమలు చేయాలని ఆదేశించారు. ఆయా ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా ప్రకటించిన అనంతరం, అభ్యర్థులు అర్హత ప్రమాణపత్రాన్ని ఇవ్వడం జాప్యం చేస్తే, నియామకం కూడా ఆలస్యమవుతుందన్నారు. సమావేశంలో మంత్రులు డాక్టర్ పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్, ఈశ్వర ఖండ్రే, కె.సుధాకర్, డాక్టర్ ఎంసీ సుధాకర్, బోసురాజు, రహీంఖాన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్, అడ్వకేట్ జనరల్ శశికిరణ్ శెట్టి, ముఖ్యమంత్రికి అదనపు ప్రధాన కార్యదర్శి ఎల్‌కే అతీక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులు, మంత్రులతో సిద్ధరామయ్య, పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య రక్షణ



చీపుళ్లు పట్టిన అధికారులు, ఉద్యోగులు

రాయచూరు, న్యూస్‌టుడే : ఎస్‌బీఐ, లీడ్ బ్యాంక్, గ్రామీణ స్వయం ఉద్యోగ శిక్షణ (ఆర్‌ఎస్‌ఈటీఐ) అధికారులు, ఉద్యోగులు బుధవారం స్థానిక ఆశాపూరు రహదారిలోని సంస్థ ఆవరణలో శ్రమదానం చేశారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతంలో చెత్తా, చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్ జి.కృష్ణ మాట్లాడుతూ ఆరోగ్య రక్షణ కోసం చుట్టు పక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలన్నారు. వార్డులు స్వచ్ఛతగా కన్పిస్తే పట్టణమంతా స్వచ్ఛంగా మారుతుందని తెలుసుకోవాలన్నారు. ఇళ్లు, కార్యాలయాలు, విద్యాలయాలు, హోటళ్లు, దుకాణాల్లోని వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దని కోరారు. చెత్త సేకరణకు వస్తున్న నగరసభ వాహనాలకు, తోపుడు బండ్లకు ఇచ్చి సహకరించాలన్నారు. లీడ్ బ్యాంక్ ముఖ్యుడు టి.తిరుమలేశ్, నాబార్డు అధికారి విజయకుమార్, గ్రామీణ సంస్థ అధికారులు, ట్రైనర్ గీతా హాజరయ్యారు.

దళిత పరిషత్‌లో సభ్యత్వ నమోదు షురూ

రాయచూరు, న్యూస్‌టుడే : దళిత సాహిత్య పరిషత్‌లో చేరేందుకు సభ్యత్వ నమోదు ప్రక్రియ మొదలైనట్లు జిల్లా అధ్యక్షుడు తాయరాజ్ మర్చటాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీవేత్తలు, రచయితలు, కళాకారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, యువత, విద్యార్థులు, సాహిత్య ప్రియులు, పోషకులు, మహా పోషకులు, శాశ్వత సభ్యత్వం పొందవచ్చునని వివరించారు. దరఖాస్తు, అదనపు సమాచారం కోసం రాయచూరులోని పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు. ఈ ఏడాది ఆఖరులో రాయచూరులో రాష్ట్ర సమ్మేళనం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

నారింజ వాగులో వ్యక్తి గల్లంతు!

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంతో వాగు దాటుతూ వరద ఉద్ధృతికి వ్యక్తి గల్లంతవగా మరొకరు నీటిలో కొట్టుకుపోతూ చెట్ల కొమ్మలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి బూచినెల్లి వద్ద నారింజ వాగు పొంగింది. కర్ణాటకలోని బీదర్ పట్టణ శివారులోని మైలూరుకు చెందిన షాకీర్(40) ద్విచక్ర వాహనంపై ఆయన ఇంటి పక్కన ఉండే ఇస్మాయిల్(60)తో కలిసి జహీరాబాద్ వైపు వస్తున్నారు. బూచినెల్లి సమీపంలోకి రాగానే నారింజ వాగు వంతెన మీదుగా పారుతున్న వరద ఉద్ధృతిని అంచనా వేయకుండా వాహనాన్ని ముందుకు పోనిచ్చాడు. మధ్యలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో షాకీర్ నీటిలో కొట్టుకుపోగా... ఇస్మాయిల్ పక్కనే చెట్లకొమ్మలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. వాగులో చెట్లకొమ్మలు పట్టుకుని నీళ్లలో ఉన్న ఇస్మాయిల్‌కు గ్రామస్థులు గుర్తించి రక్షించారు. వ్యక్తి గల్లంతు విషయం తెలుసుకున్న జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఆర్ఐ రుక్మొద్దీన్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. నారింజ ప్రాజెక్టు నుంచి వరద పోటెత్తడంతో వాగువద్ద ఘనపూర్- జహీరాబాద్ మార్గంలో రాకపోకలు నిషేధించారు.

విద్యుత్తు నిలిపివేతతో ప్రజల బెంబేలు

రాయచూరు, న్యూస్‌టుడే : జెస్కాం అనధికారికంగా విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నందున రాయచూరు నగర పౌరులు బెంబేలెత్తిపోతున్నారు. రోజులో ఎప్పుడు పడితే అప్పుడు సరఫరాను ఆపేస్తున్నారు. సాధారణంగా వర్షాలు కురిస్తే విద్యుత్తును స్తంభింపచేస్తారు. ట్రాన్స్‌ఫార్మర్లు, తీగల మార్గాలు, ఫీడర్ల వద్ద పనులు చేయాల్సివస్తే ముందుగా సమాచారం ఇస్తారు. ఇవేవి లేకున్నా ఉన్నపళంగా తీసేస్తూ ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. యూపీఎస్‌లు, జనరేటర్లను వినియోగించే వారికి ఇబ్బంది లేదు. కేవలం జెస్కాంను నమ్ముకున్న జిరాక్స్, కంప్యూటర్ సెంటర్లు నిర్వహించే వారికి కష్టాలు తప్పడం లేదు. స్లమ్ నివాసులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. రెండు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతుంది. మోటార్లు పెడితే నీళ్లు ట్యాంకులకు నీళ్లు ఎక్కుతాయి. నీరు వదిలినప్పుడే విద్యుత్తు ఆగిపోతున్నందున బోర్లు లేని వారి నీటి ఇబ్బందులు వర్ణనాతీతం. ఫిర్యాదుల కేంద్రానికి ఫోన్ చేస్తే కాల్‌కట్ అవుతుందని చెబుతున్నారు. నిత్యం ఇలా ఎందుకు అవుతుందని ప్రశ్నిస్తే సమాధానం లేదు. రాష్ట్రానికి సగానికిపైగా విద్యుత్తును అందించే శక్తినగర్, యరమరాస్ ధర్మల్ కేంద్రాలు రాయచూరు తాలూకాలో ఉన్నందున 24 గంటలు సరఫరా చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ప్రస్తుతం కర్ణాటకలో మెరుగైన ఉత్పాదన జరుగుతోంది. గృహ వినియోగం బాగా తగ్గింది. కానీ మాటిమాటికీ సరఫరా నిలిపివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వేసవి కాలంలో కోతలు విధించకపోవడంతో సంతోషపడ్డారు. వర్షాకాలంలో కోత విధించటాన్ని తప్పు బడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీసం ఆరు గంటలు తీస్తున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణగౌడ తెలిపారు. అసలు ఏ వేళలో ఉంటుందో, ఎప్పుడు తీస్తారో తెలియక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలానా సమయంలో ఉండదని ముందుగా ప్రకటించాలని జెస్కాం అధికారులకు సూచించారు.



శక్తినగర్ థర్మల్ కేంద్రం

సైనిక శిబిరం విజయవంతం



అభ్యాసం చేస్తున్న క్యాడెట్లు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ఎన్‌సీసీ క్యాడెట్ల కోసం నిర్వహిస్తున్న అఖిల భారత వాయు సైనిక్ క్యాంప్-2024కు చక్కని స్పందన లభిస్తోందని భారతీయ వాయు సేన అధికారులు ప్రకటించారు. ఈ శిబిరం అక్టోబరు ఏడో తేదీ వరకు కొనసాగనుంది. శిక్షణలో భాగంగా ఫైరింగ్, మైక్రోలైట్ ఫ్లయింగ్, ఏరో మోడలింగ్, డ్రిల్, డ్రోన్ల వినియోగం తదితరాలు ఉంటాయి. దేశంలోని 16 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి 608 మంది క్యాడెట్లు శిక్షణలో పాల్గొంటుండగా.. ఇప్పటికే అత్యధిక అభ్యర్థులు నగరానికి చేరుకున్నారు. శిక్షణ సమయంలో ప్రతిభ చూపించిన అభ్యర్థులకు చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఆల్ ఇండియా వాయు సైనిక్ ట్రోఫీని ప్రదానం చేస్తామని అధికారులు తెలిపారు.

ద్వారకనాథ్ సిఫార్సులు అమలు చేయాలి

రాయచూరు, న్యూస్‌టుడే : వెనుకబడిన పింజార, నదాఫ్, మన్సూరి సామాజికవర్గ ప్రజల ఆర్థికాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత ఇవ్వాలని కర్ణాటక పింజార, నదాఫ్, మన్సూరిల సంఘం మహా మండలి అధ్యక్షుడు ఖాసీంసాబ్ విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం ఈ వర్గాలను బీసీ కేటగిరిలో చేర్చడం వల్ల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందేవని, ఇతర సౌకర్యాలు లభించేవని వివరించారు. మూడేళ్ల క్రితం ఉపకార వేతనాలను, సౌకర్యాలను రద్దు చేసినందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీ వసతి పాఠశాలల్లో ఈ వర్గాల విద్యార్థులకు కల్పిస్తున్న ప్రవేశాలను కుదించారని తెలిపారు. ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించాలని విన్నవించారు. బీసీల ప్రగతికి ద్వారకనాథ్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రతినిధులు హసన్ అంజళ, ఎం.డి హుస్సేన్, సూపిసాబ్, బాబా పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఖాసీంసాబ్

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

25-09-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.86	1619.61
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	6,921	2,346
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	10,119	9,802
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.226	60.243

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

సిరివార, (మాన్వి) : నియోజకవర్గంలోని గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే హంపయ్యానాయక్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 1, 7, 8 వార్డులు, గొల్దిన్ని గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అంగన్‌వాడీల నిర్వహణ సరిగా ఉండాలన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తానని తెలిపారు. స్థానిక పట్టణ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌరకార్మికుల దినాచరణను ప్రారంభించారు. పట్టణాల పరిశుభ్రతకు పాటుపడే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బరోసా ఇచ్చారు. పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్య ఏర్పడకుండా అధికారులు, కార్మికులు కృషి చేయాలని తెలిపారు. కార్మికులకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందించారు. పట్టణంలో కార్మికులు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను సత్కరించారు. దివ్యాంగులకు ప్రభుత్వం సమకూర్చిన వాహనాలను పంపిణీ చేశారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు వై.భూపనగౌడ, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, తహసీల్దార్ భీమరాయ, పట్టణ పంచాయతీ ముఖ్యాధికారి తిమ్మప్ప జగ్గీ, సీడీపీఓ నాగరత్న, ఎస్సై అమరేగౌడ, ప్రముఖులు ఎన్.ఉదయ్‌కుమార్, రమేష్ దర్శన్‌కర్, శివశరణ సాహుకార్, పట్టణ పంచాయతీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హంపయ్యానాయక్

బాలల ఆరోగ్యానికి చక్కని ఆహారం

యాదగిరి, న్యూస్‌టుడే : విద్యార్థులకు వారంలో ఆరు రోజులు పౌష్టికాహారాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప తెలిపారు. అరకెరా ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో పౌష్టికత నిండుగా ఉండేలా చూస్తున్నామని చెప్పారు. అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ భాగస్వామ్యంలో ఇప్పటికే బెంగళూరులో ప్రారంభించిన కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నామని వివరించారు. వారంలో ఆరు రోజులు గుడ్లను ఇచ్చేందుకు ఫౌండేషన్ సహకరిస్తుందని, 57 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పాఠశాలలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్యక్రమంలో మంత్రులు శరణ బసప్ప దర్శనాపుర, ఎమ్మెల్యేలు శశీల్ నమోశి, చెన్నారెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధి రుద్రేశ్, విద్యాశాఖ అధికారి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధు పీఠాన్ని వీడాల్సిందే

భాజపా నేత విజయేంద్ర జోస్యం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అక్రమాల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసి, విచారణను ఎదుర్కోనడం తప్పనిసరని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర జోస్యం చెప్పారు. సిద్ధరామయ్య ఎంత మొండిగా వ్యవహరించినా, పీఠాన్ని వీడవలసిందేనన్నారు. పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతిని పురస్కరించుకుని పార్టీ ప్రధాన కార్యాలయం 'జగన్నాథభవన్'లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తాను రాజీనామా ఎందుకు చేయాలని ముఖ్యమంత్రి ప్రశ్నించడం హాస్యాస్పదమన్నారు. ముఖ్యమంత్రికి తన భార్య, కుటుంబ సభ్యులు చేస్తున్న లావాదేవీల విషయం తెలియకుండా ఉంటుందా అని న్యాయస్థానం ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. తాము రాజకీయ కక్షసాధింపుగా పోరాటం చేయలేదని, న్యాయ పోరాటం మాత్రమే చేస్తున్నామని చెప్పారు. మాజీ మంత్రి ఈశ్వరప్పను మళ్లీ భాజపాలోకి తీసుకువచ్చే ప్రయత్నాలను పార్టీ హైకమాండ్ ఇప్పటికీ ప్రారంభించలేదన్నారు. ఈశ్వరప్పను యత్నాళ్, మరికొందరు కలసిన విషయం తనకు తెలియదన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఈశ్వరప్పతో తాను ప్రస్తుతం మాట్లాడడం లేదని స్పష్టం చేశారు.



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న విజయేంద్ర

వైద్య పరీక్షలు..

వైద్య శిబిరంలో పార్టీ నాయకులు చలువాది నారాయణ స్వామి, మురుగేశ్ నిరాణి, భారతిశెట్టి, రవికుమార్, ధనుంజయ సర్జి, శరణు తల్లికేరి తదితరులు రక్తపోటు, దంత, నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. కిద్వాయి, మెట్రోపోలీస్‌తో పాటు వివిధ సంస్థల వైద్యులు, వైద్యేతర సిబ్బంది ఆరోగ్య పరీక్షలను చేశారు. దీనదయాళ్ ఉపాధ్యాయతో పాటు, ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి ప్రారంభించిన వివిధ సేవా కార్యక్రమాలను అక్టోబరు మొదటి వారం వరకు అన్ని జిల్లా, తాలూకా కేంద్రాలలో నిర్వహిస్తున్నామని విజయేంద్ర తెలిపారు.

'సిద్ధు సర్కారుపై కుట్ర'

విజయపుర, న్యూస్‌టుడే : ఎన్నికలకు బాండ్లను సేకరించడం ప్రజాస్వామ్యబద్ధం కాదని సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదవికి రాజీనామా చేయాలని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ డిమాండ్ చేశారు. తాను పదవికి రాజీనామా చేయకుండా, చేయని తప్పునకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రాజీనామా చేయమని ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నించారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మురుగేశ్ నిరాణి, జనార్దన రెడ్డి, హెచ్‌డీ కుమారస్వామి, శశికళ జొల్లె తదితరులూ పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, భాజపాలో పలువురు నాయకులు బెయిలుపై బయటే ఉన్నారని గుర్తు చేశారు. కర్ణాటకలో ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు భాజపా, దళ్ చేస్తున్న కుట్రను ప్రజలు గమనించారని తెలిపారు.